
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

శనివారం 3 ఆగస్టు 2024



పని చేసినా పస్తులే



- కష్టాల్లో ఉపాధి కూలీలు
- 74 రోజులుగా అందని వేతనాలు
- ఒక్కో ఉపాధి కూలికి రూ.20,128 బకాయి
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.98.77 కోట్ల పెండింగ్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వలసలు నివారించి.. ఉన్న ప్రాంతంలోనే పనులు చూపి కూలీల ఆర్థిక కష్టాలు తీర్చేందుకు రూపొందించి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం.. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అభాసుపాలవుతోంది. కూలీలకు దిన సరి వేతనాలు ఇవ్వకుండా.. జాబ్‌కార్డులు ఉన్న వారందరికీ పనులు కల్పించకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారు. కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు.. అయితే వారికి వారం వారం కాదు కదా నెలకు కూడా కూలి చెల్లించడం లేదు. దీంతో పనులు చేసిన వారు కూలి ఎప్పుడు జమవుతుందో తెలియక ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక జాబ్ కార్డులు ఉన్న వారు ఉపాధి పని ఎప్పుడు వస్తుందో తెలియక ఇతర పనులకు వెళ్లలేక అల్లాడిపోతున్నారు. ఉపాధి పనులు చేసినా కూలీలకు 74 రోజులుగా వేతనం అందలేదు. పనులకు హాజరైన ఒక్కో కూలీకి సుమారు రూ.20,128 వేతనం చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో దాదాపు రూ.98.77 కోట్లు ఉంది. రోజురోజుకు బకాయిలు పేరుకుపోతున్నాయే కానీ చెల్లింపులపై అధికారుల నుంచి సమాధానం లేదు. 74 రోజులుగా ఉపాధి కూలీలకు వేతనాలు పెండింగ్‌లో ఎందుకు ఉన్నాయో సమాధానం చెప్పే వారే లేకుండా పోయారు. కూలీలు మాత్రం కూలి నగదు ఎప్పుడు జమ చేస్తారో తెలియక నిత్యం పాస్ పుస్తకాలు చేతపట్టుకుని బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఎప్పుడు చూసినా ఖాతాలు ఖాళీగా ఉండటంతో కూలీలు నిరాశకు లోనవుతున్నారు.


బిల్లుల నమోదుతో సరి..

ప్రతివారం క్షేత్రస్థాయి సిబ్బంది ఉపాధి కూలీల వేతన బిల్లులను మండల కార్యాలయానికి పంపిస్తారు. వాటిని అక్కడి సిబ్బంది అంతర్జాలంలో నమోదు చేస్తారు. ఇలా నమోదు చేసిన రెండు రోజులకు కూలీలకు చెందిన ఖాతాల్లో వారు చేసిన పనులకు సంబంధించిన నగదు జమ చేస్తుంటారు. అయితే బిల్లుల నమోదు వరకు సక్రమంగా జరుగుతున్నా ఆ తర్వాత నగదు జమ ప్రక్రియ మాత్రం జరగడం లేదు. రెండు నెలలకు పైగా వేతనాలు రావడంలేదని ఉపాధి కూలీలు వాపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా మే 20 నుంచి ఇప్పటివరకు పనులు చేసిన కూలీలకు ఉపాధి సొమ్ములు చెల్లించలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. చేసిన పనికి రెండు రోజుల్లో కూలి సొమ్ము బ్యాంకు ఖాతాలకు జమచేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదని కూలీలు మండిపడుతున్నారు. కష్టపడి చేసిన పని కూలి సకాలంలో రాక పోతుండ టంతో వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ప్రతి వ్యక్తికి 100 రోజుల పనిదినాలను కల్పించడంలో యంత్రాంగం విఫలమ వుతున్నది. చేసిన పనికి వెంటనే కూలి రాకపోతుండటంతో ఈ పనులపై కార్మికులు ఆసక్తి చూపడంలేదు. దీంతో ఉపాధి పథకం లక్ష్యాలు నెరవేరడంలేదు.

సగటు వేతనం.. పనులు అంతంతే..

కేంద్ర ప్రభుత్వం కార్మికుడికి సగటు వేతనం రూ.272గా నిర్ణయించింది. అయితే ఉపాధి పనులు చేస్తున్న కార్మికులకు సగటు వేతనం లభించడంలేదు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా తమకు సగటు వేతనం అమలు చేయాలని కూలీలు కోరుతున్నారు. వ్యక్తిగత పని దినాలు కల్పించడంలో యంత్రాంగం కొంత అలసత్వం వ్యవహరిస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. పల్నాడు జిల్లాలో అత్యధికంగా 5.56 లక్షల జాబ్ కార్డులు రిజిస్ట్రేషన్ చేశారు. గుంటూరు జిల్లాలో 2.05 లక్షల, బాపట్ల జిల్లాలో 4.56 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. నమోదు చేసుకున్నవారందరూ పనులకు హాజరు కావడంలేదు. పల్నాడులో 4.38 లక్షల కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. బాపట్లలో 3.65 లక్షల, గుంటూరులో 1.48 లక్షల కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. వీరు మాత్రమే ఉపాధి పనులకు హాజరౌతున్నారు. పేరు నమోదు చేసుకుని పనులకు హాజరు కాని కార్మికుల సంఖ్య లక్షల్లో ఉండటం గమనార్హం. వీరికి కూడా ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయడంలేదు. ఉపాధి పనుల్లో కార్మికుల పని దినాలను ముందుగానే అంచనా వేస్తున్నారు. ఈ మేరకు పని దినాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నట్లు లెక్కలు తెలియజేస్తున్నాయి. పనులకు సంబంధించిన సామగ్రి బిల్లుల బకాయి కూడా రూ.కోట్లలో పేరుకుపోయినట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వం మార్చిలో విడుదల చేసిన సామగ్రి బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించుకోవడంతో బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి.

- రాజధానికి మకుటాయమానంగా తీర్చుదిద్దుతా
- నాణ్యమైన విద్యా బోధన, పరిశోధనలకు పెద్దపీట
- నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు



సెంట్రల్ వర్సిటీ స్థాయికి.. ఏఎన్‌యూ

పెదకాకాని, ఆగస్టు 2: నాణ్యమైన బోధన.. అత్యుత్తమ పరిశోధనలు.. సకల సౌకర్యాలతో విద్యా కేంద్రంగా వర్సిటీని తీర్చిదిద్ది సెంట్రల్ యూనివర్సిటీ హోదా తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తా. ఆంధ్ర రాజధాని అమరావతికి సమీపంలో ఉన్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాన్ని రాజధానికే మకుటాయమానంగా తీర్చిదిద్దుతా.. అని ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆచార్య కంచర్ల గంగాధరరావు తెలిపారు. ఇండియా టు డే సర్వేలో వర్సిటీకి దేశవ్యాప్తంగా 12వ ర్యాంకు వచ్చిన సందర్భంగా శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వర్సిటీలో త్వరలో ఇంకుబేసిన్(శిక్షణ కేంద్రాలు) సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. నాణ్యమైన బోధన అందిస్తూ, పరిశోధనలకు పెద్ద పీట వేయనున్నట్లు తెలిపారు. ఏఎన్‌యూకి కేంద్రీయ విశ్వవిద్యాలయం హోదా వస్తే ప్రస్తుతం ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రెట్టింపు అయ్యే అవకాశం ఉందన్నారు. వర్సిటీలో కేంద్రీయ కృషి విద్యాలయ స్థాయి సౌకర్యాలు ఉన్నాయి, వీటిని వినియోగించుకుని ఆ హోదా తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర విభజన తర్వాత అనంతపురం, వైజాగ్, తిరుపతి, విజయనగరం జిల్లాలలో కేంద్రీయ విశ్వవిద్యాలయాలను కేంద్రం నెలకొల్పిందన్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం ఒక రాష్ట్రానికి ఎన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ఉండాలన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రయత్నాలు చేస్తామన్నారు.

ప్రక్షాళన.. చర్యలు

వర్సిటీలో గత ప్రభుత్వ హయాంలో తప్పు చేసిన ఉద్యోగులపై నిబంధనల మేరకే చర్యలు ఉంటాయి. గతంలో కొందరు ఉద్యోగులు అప్పటి పార్టీ అండ చూసుకుని చేసిన పనులు, నిర్ణయాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. వర్సిటీలో అన్ని శాఖల్లో పరిశీలన చేస్తున్నాం. ఆయా శాఖల్లో జరిగిన లోటుపాట్లను పరిశీలించి త్వరలో ప్రక్షాళన మొదలు పెడతాం. బాధ్యతలు చేపట్టిన పది రోజుల నుంచి వర్సిటీలో ఖాళీగా ఉన్న పరిపాలనాపరమైన పదవులను సామాజిక వర్గాల వారీగా భర్తీ చేశాం. నూతన సంస్కరణలతో వర్సిటీ కీర్తిని మరో మెట్టు పైకి తీసుకెళ్తాం.

నూతన కోర్సులు.. స్కిల్ డెవలప్‌మెంట్

విశ్వవిద్యాలయంలో సైన్స్ అండ్ టెక్నాలజీలో నూతన కోర్సులను ప్రవేశపెడుతున్నాం. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్ వంటి కోర్సులు ప్రస్తుతం ఉన్నాయి. వాటికి అనుబంధంగానే నూతన కోర్సులను ప్రవేశ పెట్టేందుకు చర్చలు జరుపుతున్నాం. ఆయా కోర్సులకు సంబంధించి నిష్ణాతులతో ప్రత్యేక శిక్షణాకేంద్రాలను నెలకొల్పే యోచనలో ఉన్నాం. వర్సిటీలో సాధారణ కోర్సులు అభ్యసించే విద్యార్థుల్లో స్కిల్ డెవలప్‌మెంట్ ఎలా అభివృద్ధి చేయాలో కూడా ఆలోచన చేస్తున్నాం. విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించడం, అధునాతన పరిశోధనలకు, ఉపాధికల్పనే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నాం. వర్సి టీలో చదువుకుంటు న్న విద్యార్థులు ఉద్యోగాలతో బయటకు వెళ్లే లాగా ప్రణాళిక లు రూపొంది స్తున్నాం.



ఎమ్మెల్యే క్వార్టర్స్ ప్రాంగణంలో నిపుణుల బృందం

ఇప్పటికైతే భేష్


- ఐదేళ్లైనా పటిష్ఠంగానే నిర్మాణాలు
- పూర్తిగా పరిశీలించి నివేదిక రూపొందిస్తాం
- అమరావతి భవన నిర్మాణాల నాణ్యతపై సంతృప్తి
- రాజధానిలో ఐఐటీ హైదరాబాద్ నిపుణుల బృందం పర్యటన

తుళ్లూరు, ఆగస్టు 2: అమరావతిలో గత టీడీపీ ప్రభుత్వం నిర్మాణం చేపట్టగా, వైసీపీ పాడుబెట్టిన భవనాలు.. ఇప్పటికైతే బాగున్నాయి. ఐదేళ్లు అయినా నిర్మాణాలు పటిష్ఠంగానే ఉన్నాయి.. అని హైదరాబాద్ ఐఐటీ నిపుణులు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమరావతిపై దృష్టి పెట్టింది. ప్రభుత్వ ఆదేశాలతో తొలుత సీఆర్‌డీఏ జంగిల్ క్లియరెన్స్ చేసింది. ఆ తర్వాత గత టీడీపీ హయాంలో నిర్మాణాలు చేపట్టి వైసీపీ తీరుతో నిలిచి పోయిన పనులపై దృష్టి పెట్టింది. ఐదేళ్లుగా వైసీపీ పాడుబెట్టిన నిర్మాణాల నాణ్యత, పనులపై చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దృష్టిపెట్టారు. నిర్మాణాల నాణ్యతను పరిశీలించి నివేదిక ఇవ్వాలని హైదరాబాద్ ఐఐటీ నిపుణులను రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ నేపథ్యంలో ఆ బృందం శుక్రవారం రాజధానిలో పర్యటించింది. ఐఐటీ హైదరాబాద్‌లోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ కేబీఎల్ సుబ్రహ్మణం, విభాగాధిపతి మున్వర్‌బాషాల నేతృత్వంలో ఆరుగురు సభ్యులు సీఆర్డీఏ అధికారులతో భేటీ అయి చర్చించారు. తొలుత ఈ బృందం రాయపూడి రెవెన్యూ పరిధిలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఐఏఎస్, ఐపీఎస్‌ల కోసం గత టీడీపీ ప్రభుత్వం నిర్మించిన భవన సముదాయాలను పరిశీలించింది. మధ్యాహ్నం తర్వాత గ్రూప్ 1, 2, క్లాస్-4, ఉద్యోగుల ఇళ్ల టవర్లను జడ్జీలు, మంత్రుల భవనాలను పరిశీలించింది. అనంతరం ప్రొఫెసర్ కేబీఎల్ సుబ్రహ్మణ్యం విలేకర్లతో మాట్లాడుతూ అమరావతిలో ప్రభుత్వం నిర్మించిన భవన నిర్మాణాల స్థితిగతులను అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. భవనాల పరిస్థితి ఎలా ఉంది, సామర్థ్యం, వాటిని ఎప్పటికి అందుబాటులోకి తీసుకురాగలుగుతామనే అంశాలపై సీఆర్డీఏతో కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరింత విస్తృతస్థాయిలో పరిశోధించి సీఆర్‌డీఏకు నివేదిక అందజేస్తామని తెలిపారు. ప్రస్తుతం భవనాల పరిస్థితి బాగానే ఉందనిపించినా అప్పుడే ఒక అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేమన్నారు. భవన నిర్మాణాలకు వేసిన రంగులు, ప్లాస్టరింగ్ నాణ్యతను పరిశీలించిన అధికారులు ఐదేళ్ల తర్వాత కూడా అవి చెక్కు చెదరక పోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. నిర్మాణాల విషయంలో గత టీడీపీ ప్రభుత్వం నాణ్యతా ప్రమాణాలను పక్కాగా పాటించడం వల్లే ఇప్పటికీ భవనాలు అద్భుతంగా ఉన్నాయన్నారు.

మంత్రుల క్వార్టర్స్‌ను పరిశీలిస్తున్న ఐఐటీ నిపుణుల బృందం



నాగార్జున సాగర్ జలాశయం



సాగర్‌కు ఉధృతంగా వరద

- 3.99 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- జలాశయంలో 552 అడుగులకు చేరిన మట్టం
- పులిచింతలకు 27,586 క్యూసెక్కులు నీరు విడుదల
- 16 నెలల తర్వాత టెయిల్‌పాండ్ ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి




నిండుకుండలా టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్

నరసరావుపేట (ఆంధ్రజ్యోతి), మాచర్ల రూరల్, రెంటచింతల, ఆగస్టు 2: బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను.. బంగారు పంటలే పండేను... ఈ చిత్రం నాగార్జున సాగర్ కుడి కాల్వ ఆయకట్టులో త్వరలో ఆవిష్కృతం కానున్నది. ఎగువనుంచి వస్తోన్న ప్రవాహంతో సాగర్ జలాశయంలో నీటి నిల్వలు గణనీయంగా పెరుగుతున్నాయి. 3.99 లక్షల క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి 5.35లక్షల కూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శనివారం సాగర్‌కు మరింతగా వరద పెరుగుతుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. కృష్ణమ్మ ఉప్పొంగుతుండటంతో కుడికాల్వ ఆయకట్టు రైతుల్లో సంతోషం వెల్లివిరుస్తున్నది. కుడి కాల్వకు నీటి సరఫరాను కొనసాగిస్తుండటంతో రైతులు వరి నారుమళ్లు పోస్తున్నారు. సాగర్ జలాశయంలో నీటి మట్టం 590 అడుగులకు 552 అడుగులకు చేరుకుంది. పూర్తిస్థాయి నిల్వ 312.05 టీఎంసీలు కాగా శుక్రవారానికి 215.10 టీఎంసీలకు చేరింది. ఇంకా 96.95 టీఎంసీల నీటి నిల్వ చేరితే జలాశయం పూర్తిగా నిండుతుంది. ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1650, కుడి కాల్వ ద్వారా 5944, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 23,565 మొత్తం ఔట్‌ఫ్లోగా 31,159 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సత్రశాలలో నదిపై నిర్మించిన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో గురువారం రాత్రి నుంచి విద్యుదుత్పత్తి ప్రారంభించినట్లు ఎస్ఈ వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. 2023 మార్చి 31 తర్వాత విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం ఇదే ప్రథమమని తెలిపారు. విద్యుదుత్పత్తి అనంతరం 23,475 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు వస్తుందన్నారు. దీంతో రిజర్వాయర్‌లో 75.30 మీటర్లు అంటే 7.011 టీఎంసీల నీరుందన్నారు. డ్యాంకు సంబంధించి 4 క్రస్ట్‌గేట్లలో 2 గేట్లు 1 మీటర్, 2 గేట్లు 1.25 మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 19,298 క్యూసెక్కులు, విద్యుత్ తయారీ అనంతరం టేల్ రేస్ ఛానల్ ద్వారా 8288 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామన్నారు.రెండు టర్బయిన్ల ద్వారా మంగళవారం సాయంత్రం వరకు 0.9 ఎంయు(మిలియన్ యూనిట్)ల విద్యుత్ తయారైందన్నారు. టెయిల్ పాండ్ ప్రాజెక్టులో 16 నెలల అనంతరం విద్యుత్‌ను తయారు చేయడంపై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎస్ఈ వెంకటరమణతో ఫోన్లో మాట్లాడారు. కిందటేడు వర్షాలు లేక రిజర్వాయర్లు వెలవెలపోయాయని ఈ సారి అందుకు భిన్నంగా పరిస్థితి ఉందని ఆనందం వ్యక్తం చేశారు.

- ఆగస్టు 15న సమీపిస్తున్నా పూర్తి కాని నియామకాలు
- స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ జెండా ఎగరేసేదెవరో?

ఇన్‌చార్జి మంత్రులెవరో?



గుంటూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం తేదీ సమీపిస్తున్నా ఇంకా జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రుల నియామకం పూర్తికాలేదు. దీంతో జిల్లా స్థాయిలో జరిగే వేడుకల్లో జాతీయ జెండాని ఎవరు ఎగుర వేసి స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్నిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ ఆలోపు ఇన్‌చార్జి మంత్రుల నియామకం పూర్తికాకుంటే ఎవరితో త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేయిస్తారనేది అర్థం కాకుండా ఉన్నది. గుంటూరు జిల్లాలో ఇద్దరు మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్ ఉన్నారు. బాపట్లలో గొట్టిపాటి రవికుమార్ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పల్నాడు జిల్లాకు ఒక్క మంత్రి కూడా లేరు. ఈ క్రమంలో గుంటూరు, బాపట్ల జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రుల నియామకం జరగని పక్షంలో సీనియర్ మంత్రుల్లో ఒకరికి అవకాశం కల్పిస్తారు. అయితే పల్నాడు జిల్లా నుంచి మంత్రి ఎవరూ లేని దృష్ట్యా ఆ జిల్లాలో ఎవరు జెండా ఎగుర వేస్తారనేది చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే ప్రతీ జిల్లాకు ఒక ఇన్‌చార్జి మంత్రిని నియమించడం ఆనవాయితీగా వస్తున్నది. ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన ప్రతీ మూడు నెలలకు ఒకసారి జిల్లా సమీక్షా మండలి సమావేశాన్ని నిర్వహించి వివిధ అంశాలపై చర్చించి తీర్మానాలు ఆమోదిస్తారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చివరిసారిగా డీఆర్‌సీ మీటింగ్ గత ఏడాది డిసెంబరు 1న జరిగింది. ఆ తర్వాత ఎన్నికల వాతావరణం వచ్చేసింది. మార్చిలో ఎన్నికల కోడ్ రావడంతో డీఆర్‌సీ నిర్వహించే అవకాశం లేకుండా పోయింది. ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం పడిపోయి టీడీపీ అధికారంలోకి వచ్చింది. అయితే ఇప్పటివరకు ఇన్‌చార్జి మంత్రుల నియామకాన్ని చేపట్టలేదు. జిల్లాలో రైతులు, పేదలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. వాటిపై చర్చించి తీర్మానాలను ఆమోదించి ప్రభుత్వానికి పంపాలి. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా ఆ ప్రక్రియని పూర్తి చేయాలని ప్రతీ ఒక్కరూ కోరుకొంటున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఇచ్చే సందేశంపైనా సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అమరావతి రాజధానిని స్వాతంత్ర్య దినోత్సవ సందేశాల్లో లేకుండా చేసింది. అయితే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దృష్ట్యా ఈ దఫా ఖచ్చితంగా అమరావతి ప్రస్తావన ఉండే అవకాశం ఉంది. కేంద్రం ఇప్పటికే రూ.15 వేల కోట్ల సాయాన్ని రాజధాని నిర్మాణానికి ప్రకటించింది. ఆ విషయాన్ని సందేశంలో చేర్చే అవకాశం ఉన్నది. అలానే సూపర్ సిక్స్ హామీల అమలుకు కార్యాచరణని కూడా ప్రకటించొచ్చు. ఒకవేళ ఇన్‌చార్జి మంత్రుల నియామకం పూర్తికాకపోతే సీనియర్ మంత్రుల్లో ఒకరికి జెండా ఎగుర వేసే అవకాశం లభిస్తుంది. ఆ ప్రకారం చూసుకుంటే గుంటూరు జిల్లాలో సీనియర్ మంత్రి నారా లోకేశ్ అవుతారు. ఇందుకు కారణం గత టీడీపీ ప్రభుత్వంలోనే ఆయన మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ దృష్ట్యా లోకేశ్‌కే జెండా ఎగురవేసే అవకాశం లభిస్తుంది. ఇంకా 12 రోజుల సమయం ఉన్న నేపథ్యంలో ఇన్‌చార్జి మంత్రుల నియామకాన్ని ప్రభుత్వం చేపట్టే అవకాశం ఉందని అంతా భావిస్తున్నారు.

6 లో..

అమరావతి పింఛన్ పొడిగింపుపై హర్షం

చంద్రబాబు చిత్రపటానికి రైతుల పాలాభిషేకం

సాగర్ విమానాశ్రయ భూముల పరిశీలన

స్టాక్ పాయింట్‌లో దళారులకు పనేమిటి

- ఉచిత ఇసుకలో అక్రమాలకు తావిస్తే కఠిన చర్యలు
- మున్నంగిలో సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్ తనిఖీ.. హెచ్చరిక

3జీ నుంచి 4జీ సిమ్‌కు ఉచితంగా మార్పు

బీఎస్ఎన్ఎల్ గుంటూరు బిజినెస్ ఏరియా జీఎం శ్రీధర్

గుంటూరు(తూర్పు), ఆగస్టు 2: బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఉచితంగా తమ 3జీ నుంచి 4జీ సిమ్‌కు అప్‌గ్రేడ్ చేసుకుని సేవలను సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. ఎక్కువ మంది వినియోగదారులు ఇప్పటికీ తమ మొబైల్ సేవలను 2జీ, 3జీ సిమ్‌లో మాత్రమే ఉపయోగిస్తున్నారన్నారు. 4జీ సేవలు ప్రారంభించినప్పుడు 2జీ, 3జీ సేవల్లో వినియోగదారులకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. 4జీకి అప్ గ్రేడ్ చేసిన తర్వాత 2జీ సేవలు కూడా కొనసాగుతాయని తెలిపారు. ఫోన్ నుంచి 54040కి సందేశాన్ని పంపడం ద్వారా వినియోగదారులు తమ సిమ్ 4జీ అవునో, కాదో తెలుసుకోవచ్చని, నేమ్ అనే సందేశంతో సిమ్ ఎవరి పేరు మీద ఉన్నదో తెలుసుకోవచ్చని తెలిపారు.

పరీక్షా కేంద్రాల్లో వర్సిటీ కోఆర్డినేటర్ తనిఖీ

పెదకాకాని, ఆగస్టు 2: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 1 నుంచి ప్రారంభమైన డిగ్రీ 5, 6 సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాలను కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్‌వీ కృష్ణారావు శుక్రవారం తనిఖీ చేశారు. మంగళగిరిలోని వి.టి.జె.ఎం అండ్ ఐ.వి.టి.ఆర్ డిగ్రీ కళాశాలలోని కేంద్రాన్ని సందర్శించి పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.

స్టాక్ పాయింట్‌లో దళారులకు పనేమిటి

ఉచిత ఇసుకలో అక్రమాలకు తావిస్తే కఠిన చర్యలు

మున్నంగిలో సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్ తనిఖీ.. హెచ్చరిక



స్టాక్‌పాయింట్‌లో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్

కొల్లిపర, ఆగస్టు 2: ఇసుక స్టాక్‌పాయింట్‌లో దళారులకు, నాయకులకు పనేమిటి.. ఉచిత ఇసుకను నీరుకారిస్తే సహించేది లేదు.. టోకెన్ల ప్రకారం వాహనాలు రావాల్సిందే.. అక్రమాలకు తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.. అని సబ్ కలెక్టర్ ప్రఖార్‌జైన్ అధికారులను హెచ్చరించారు. మండల పరిధిలోని మున్నంగి స్టాక్‌పాయింట్‌లో.. ఇసుక సీరియల్ చీటీ రూ.2500 అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనంపై సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్ స్పందించారు. ఈ క్రమంలో మున్నంగి స్టాక్ పాయింట్‌లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. తొలుత ఆయన స్టాక్ పాయింట్‌లో పరిస్థితిని పరిశీలించారు. రిజిష్టర్లను, రికార్డులను, క్యూ ఆర్ కోడ్ ద్వారా డిజిటల్ చెల్లింపుల విధానాన్ని తనిఖీ చేశారు. ఇసుక లోడింగ్ ఎలా జరుగుతుంది.. టోకెన్లు వరుసక్రమంలో ఇస్తున్నారా లేదా అని వాహనదారులను ప్రశ్నించారు. స్టాక్‌పాయింట్‌లో నాయకులు, దళారులదే హవా అని, టోకెన్ల ప్రకారం లోడింగ్ జరగడం లేదని, పలుకుబడి ఉన్న వ్యక్తులకు లోడింగ్ వెంటనే జరుగుతుందని, సీరియల్‌తో సంబంధం లేకుండా ఇసుక నింపుకెళ్లిన లారీలే మళ్లీమళ్లీ వస్తున్నాయని, క్యూలో మూడు, నాలుగు రోజులు పడిగాపులు పడాల్సి వస్తోందని ఇసుక కోసం వచ్చిన వినియోగదారులు, వాహనదారులు సబ్ కలెక్టర్ ఎదుట తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఇసుక లోడింగ్ సమయంలో ఎక్స్‌కవేటర్ డ్రైవర్లు వివక్ష చూపుతున్నారని కొందరు లారీ డ్రైవర్లు ఆరోపించారు. అనంతరం ప్రఖార్‌జైన్ మాట్లాడుతూ ఇసుక విధానంలో ఎటువంటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. స్టాక్‌పాయింట్‌లో దళారులు, నాయకులకు ప్రాధాన్యం ఇవ్వొద్దని అధికారులకు తెలిపారు. వాహనదారులకు ఏరోజుకా రోజుకు టోకెన్లు ఇవ్వాల ని, వరుస క్రమంలో లోడింగ్ చేయాలన్నారు. ఇసుక లోడింగ్ విషయంలో అవకతవకలను ఉపేక్షించేది లేదని, ఫిర్యాదులు రాకుండా అధికారులు చర్య లు తీసుకో వాలన్నారు. డ్రైవర్ల నుంచి ఎటువంటి ఆరోపణలు రాకుండా చూసుకోవాలన్నారు. తనిఖీలో సబ్‌కలెక్టర్ వెంట తహసీల్దారు జి.సిద్ధార్థ, తెనాలి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ పోతురాజు, ఆర్ఐ శ్రీనివాసరావు ఉన్నారు.



మున్నంగిలో ఇసుక స్టాక్‌పాయింట్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్

ఆక్రమణదారుడి అనుమతితోనే పూరిల్లు తొలగింపు

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 2: సత్తెనపల్లి మండలం కంకణాలపల్లిలో గ్రామ అవసరాల కోసం ఓ దాత ఇచ్చిన స్థలాన్ని కంటు బ్రహ్మయ్య అనే వ్యక్తి ఆక్రమించి పూరిల్లు నిర్మించుకోగా అతడి అనుమతితో తొలగించినట్లు గ్రామస్థులు తెలిపారు. దాత వారసులు టీడీపీ సానుభూతి పరులు కావడంతో బ్రహ్మయ్య ఈ ఘటనకు పార్టీ రంగు పులిమాడని గ్రామస్థులు చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. సర్వే నెంబరు 71-1లో ఆరు సెంట్ల స్థలాన్ని గ్రామ అవసరాల కోసం దాత పచ్చ వెంకటేశ్వర్లు దానం చేశారు. అక్కడ ఎన్‌టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయగా మిగిలిన స్థలం ఖాళీగా ఉంది. ఆ ఖాళీ స్థలంలో బ్రహ్మయ్య తండ్రి కంటు బాబు బడ్డీ కొట్టు పెట్టుకుని టీ, సిగరెట్లు అమ్ముతూ జీవనం సాగించేవాడు. బాబు మరణానంతరం బ్రహ్మయ్య అదే స్థలాన్ని ఆక్రమించి పూరిల్లు నిర్మించుకోవటమే కాక ఇంటి చుట్టూ ఫెన్సింగ్ వేశాడు. ఆ స్థలం పాఠశాల ఎదురుగా ఉండటం, అక్కడ మద్యం బెల్టు షాపు నిర్వహిస్తుండటంతో బ్రహ్మయ్యకు గ్రామస్థులు ఎన్ని సార్లు చెప్పినా లెక్క చేయలేదు. దాత ఇచ్చిన స్థలం ఈ విధంగా పాడువుతుందని గ్రహించిన గ్రామస్థులు అక్కడ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు పూనుకున్నారు. దాత వారసులు, గ్రామస్థులు బ్రహ్మయ్యను పిలిచి స్థలం ఖాళీ చేయాలని చెపితే వారి మాటలు పెడచెవిన పట్టి రాత్రి వేళల్లో మద్యం మత్తులో అసభ్యకరంగా మాట్లాడేవాడన్నారు. దీంతో జూలై 31న డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని దాత వారసుడైన పచ్చా సుధీర్ తెలిపారు. ఈ విషయంపై గ్రామంలో పెద్ద మనుషుల మధ్య పంచాయితీ జరిగిందని, రెండు సెంట్ల స్థలం ఇస్తామని చెప్పినా బ్రహ్మయ్య లెక్క చేయలేదన్నారు. దీంతో తాము పూరింటికి ఉన్న గుంజలు తీసి వేస్తుండగా పోలీసులు వచ్చి నిలుపుదల చేశారని దాత వారసులు తెలిపారు. ఆగస్టు 1న పోలీసులు స్టేషన్‌కు పిలిపించారన్నారు. ఆ సమయంలో బ్రహ్మయ్య తాను ఇంటి వద్ద బోరు వేయించి మోటారు బిగించుకున్నానని, అందుకు రూ.30 వేలు ఖర్చుయిందని చెప్పడంతో వారసులు బ్రహ్మయ్యకు రూ.10వేలు ఇచ్చారు. స్థలం ఖాళీ చేశాక మిగిలిన రూ.20 వేలు ఇస్తామని చెప్పారు. డబ్బు తీసుకున్న బ్రహ్మయ్య మరలా తనకు గ్రామంలో ఇల్లు కూడా లేదని పోలీసుల వద్ద చెప్పడంతో వీఆర్‌వో ద్వారా విచారణకు ఆదేశించారు. వీఆర్‌వో విచారణలో బ్రహ్మయ్యకు అదే బజారులో డాబా ఉందని తేలింది. దీంతో బ్రహ్మయ్య, వారసులతో పాటు గ్రామస్థులు సమక్షంలోనే ఆక్రమిత పూరింటిని తొలిగించారు. బ్రహ్మయ్య అనుమతితోనే తొలగించారే తప్ప కూల్చి వేయలేదని గ్రామస్థులు తెలిపారు.

ఉద్యోగ భద్రత కోసం ఫీల్డ్ అసిస్టెంట్ల ఆందోళన



రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయం ఎదుట బైఠాయించిన ఫీల్డ్ అసిస్టెంట్లు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 2: గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తాడేపల్లిలోని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ కార్యాలయం వద్ద వారు ఆందోళన చేశారు. అంతకుముందు ఏపీ గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమ తొలగింపులు ఆపాలని, ఇప్పటివరకు తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

హైవే పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, ఆగస్టు 2: 167 ఏడీ జాతీయ రహదారి పనులను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుక్రవారం పరిశీలించారు. మాచర్ల పరిధిలోని పాలువాయిగేట్ వద్ద నిర్మితమయ్యే రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు, గోలి వాగుపై హైలెవల్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈయన వెంట ప్రాజెక్టు మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

క్లోజర్, లోన్ల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు(విద్య), ఆగస్టు 2: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమాలో పాలసీ కాలం పూర్తి అయిన వారు రుణాల కోసం చేసుకున్న దరఖాస్తులను పరిష్కరించాలని యూటీఎఫ్ అధ్యక్ష,కార్యదర్శులు ఆదిలక్ష్మి, కళాధర్ కోరారు. మేరకు ప్రభుత్వ జీవిత బీమా జేడీ దౌలూరి అశోక్‌కు గురువారం వారు వినతి పత్రం అందజేశారు. ఎంఈవో గుర్తింపు ద్వారా ఆయా సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. వయో పరిమితి దాటి ప్రీమియం పెంచుకోడానికి సివిల్ అసిస్టెంట్ సర్జన్ సర్టిఫికెట్ అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా యూటీఎఫ్ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఒంటరితనంతో వ్యక్తి ఆత్మహత్య

మాచర్ల రూరల్, ఆగస్టు 2: ఒంటరితనాన్ని భరించలేక పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాచర్లలో శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని కంభంపాడుకు చెందిన క్రాంతి లక్ష్మారెడ్డి(37) తల్లిదండ్రులు మరణించారు. భార్య దూరంగా ఉంది. దీంతో అతడు కొంతకాలంగా పట్టణంలోని నెహ్రూనగర్ మొదటి లైన్‌లో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. కాగా గురువారం రాత్రి స్నేహితుడు శివారెడ్డికి ఫోన్ చేసి తాను పురుగుల మందు తాగినట్లు చెప్పాడు. దీంతో శివారెడ్డి నెహ్రూనగర్ చేరుకుని లక్ష్మారెడ్డిని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు నరసరావుపేటకు రిఫర్ చేశారు. మార్గమధ్యలో లక్ష్మారెడ్డి మృతి చెందారు. కాగా దీనిపై పట్టణ పోలీస్‌స్టేషన్లో ఎటువంటి కేసు నమోదు కాలేదు.

షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 2: మండలంలోని గుడిపూడి జడ్పీ హైస్కూల్ ఆవరణలో పల్నాడు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సబ్ జూనియర్ బాల బాలికల జిల్లా జట్ల ఎంపికలు జరిగాయి. ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా బాలుర విభాగంలో 60, బాలికల విభాగంలో 40 మంది హాజరైనట్టు షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మువ్వా నరసింహారావు, కోనంకి కిరణ్ కుమార్ తెలిపారు. జట్లకు ఎంపికైన క్రీడాకారులు వివరాలను వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం తోక సోమనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలుర జట్టు: టీ తిలక్, కే నరేష్, ఎస్ భార్గవ్, జీ నాగహనుమ, జీ వెంకటేష్, వైఎస్ లిఖిత్‌రెడ్డి, జే మధు, పీ గోపీచంద్, వీ పణీంద్ర, కే యశ్వంత్, ఎం సతీష్, కే తరుణ్‌తేజ, స్టాండ్ బైలుగా ఎల్ అరవింద్, ఈ యోగి

బాలికల జట్టు: ఎం నందిని, ఎన్ అనూష, పీ సుచిత్ర, టీ భార్గవి, పీ మేఘన, ఎస్ సింధూర, పీ సులోచనరాణి, వీ విజయలక్ష్మి, కే శ్రీలక్ష్మి, సీహెచ్ ప్రియాంక, సీహెచ్ హారిక, కే బిందు మాధవి ఎంపికయ్యారు.

సాగర్ విమానాశ్రయ భూముల పరిశీలన



కెప్టెన్ మమతతో చర్చిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

మాచర్ల రూరల్, ఆగస్టు 2: ఎన్డీయే ప్రభుత్వం నాగార్జునసాగర్‌లో నూతనంగా 1800 ఎకరాల్లో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన నేపథ్యంలో కలెక్టర్ అరుణ్‌బాబు శుక్రవారం సాగర్‌లో పర్యటించారు. ఫ్లయిటెక్ ఏవియేషన్‌కు చేరుకుని ఆ సంస్థ ఎండీ కెప్టెన్ మమతతో చర్చించారు. అనంతరం విమానాశ్రయం ఏర్పాటు కావాల్సిన భూములను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో సరోజిని, డీటీవో శ్రీనివాసరావు, కెప్టెన్ నాని, విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభి రామయ్య తదితరులు ఉన్నారు.

పింఛన్‌దారులపై మానవత్వం

పదుల కిలోమీటర్లు ప్రయాణించి నగదు పంపిణీ



గుంటూరులో చికిత్స పొందుతున్న పింఛన్‌దారులకు నగదు అందజేస్తున్న గోళ్లపాడు వీఆర్‌వో దాసు, ఒప్పిచర్ల వీఆర్వో కోటేశ్వరరావు

గుంటూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తీవ్ర అనారోగ్యంతో గుంటూరులోని ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పింఛన్‌దారుకు పెన్షన్ పంపిణీ చేసేందుకు వీఆర్‌వో 45 కిలోమీటర్ల దూరం ప్రయాణించారు. ముప్పాళ్ల మండలం గోళ్లపాడుకు చెందిన సగినాల నాగమల్లేశ్వరి తీవ్ర అనారోగ్యంతో గుంటూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈమె గురువారం పింఛన్ తీసుకోలేదు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విషయాన్ని స్థానిక వీఆర్‌వో దాసు తెలుసుకున్నారు. కష్టకాలంలో ఆ వృద్ధురాలికి ఎలాగైనా పింఛన్‌ని అందజేసి ఆర్థికంగా అండగా నిలవాలని వీఆర్‌వో భావించారు. శుక్రవారం రాత్రి గోళ్లపాడు నుంచి గుంటూరుకి వచ్చి నాగమల్లేశ్వరికి పింఛన్ అందించారు. ఈ సందర్భంగా ఆమె కళ్లలో చూసిన ఆనందం ఎంతో సంతోషాన్ని కలిగించిందని వీఆర్‌వో దాసు తెలిపారు.

కారంపూడి: మండలంలోని ఒప్పిచర్ల ఎస్సీ కాలనీకి చెందిన బత్తుల పున్నారావు అనారోగ్య కారణాలతో గుంటూరులోని జనరల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈయన పింఛన్‌దారుడు కావడంతో వీఆర్వో కోటేశ్వరరావు శుక్రవారం తన సొంత ఖర్చులతో గుంటూరుకు వెళ్లిలో చికిత్స పొందుతున్న పున్నారావుకు పింఛన్ నగదు అందించారు. అక్కడే చికిత్స పొందుతున్న బొల్నేడి లక్ష్మమ్మ అనే మహిళకు కూడా పెన్షన్ అందజేసి మానవత్వం చాటుకున్నారు.

జంగమహేశ్వరపాడులో నాటుబాంబు గుర్తింపు



తనిఖీలు నిర్వహిస్తున్న బృందాలు

దుర్గి, ఆగస్టు 2: మండలంలోని జంగమహేశ్వరపాడులో శుక్రవారం క్లూస్‌టీం, బాంబు డిస్పోజల్ బృందం, డాగ్ స్క్వాడ్ తనిఖీలు జరిపాయి. గ్రామ శివారులోని పొలాల్లో నిరుపయోగంగా ఉన్న నాటుబాంబును గుర్తించినట్లు సమాచారం. జూలై 30న బాణావత్ శ్రీనునాయక్‌ను విచారించగా మరికొన్ని బాంబులు ఉన్నట్లు సమాచారం ఇచ్చాడు. ఈ క్రమంలో పోలీసులు బృందాలు తనిఖీలు జరిపాయి.

ఒడిస్సావాసి ఆత్మహత్య



ప్రత్తిపాడు, ఆగస్టు 2: ఒడిస్సాకు చెందిన జగదీష్ స్వైన్ (38) అనే వ్యక్తి మండల పరిధిలోని తుమ్మలపాలెంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రత్తిపాడు పోలీసులు తెలిపారు. ఎనిమిదేళ్ల క్రితం తెనాలికి వచ్చిన ఇతడు అక్కడ మిల్లులో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తూ ఉండేవాడు. అయితే కొన్ని రోజుల క్రితం ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం సమీపంలోని మిల్లులో పనిచేయడానికి వచ్చాడు. ఈ క్రమంలో జగదీష్ స్వైన్ తనకు పరిచయమైన రాజు వద్దకు వచ్చి అతడి ఇంట్లోని ఓ గదిలో నివాసం ఉంటున్నాడు. అయితే గురువారం గదిలోని కిటికీకి దుప్పటితో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించగా పక్కన రూమ్‌లో నివాసం ఉండే వారు చూసి కేఎంసీ వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు మృతుడి అన్న కల్పతరు స్వైన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ బ్రహ్మానాయుడు కేసు నమోదు చేశారు.

నేడు మాచవరానికి యరపతినేని

మాచవరం, ఆగస్టు 2: గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శనివారం మాచవరంలో పర్యటించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ బడిగుంచల వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక మునుసుబు కల్యాణ మండపంలో కూటమి పార్టీల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101, 109,120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00

34,174 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 29,367 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 34,174 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 16,098 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు శుక్రవారం ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8,000	16,500	334	10,000	15,000
నెంబరు. 5	10,000	12,000	నెంబరు. 5	10,500	10,500
273	9,000	12,000	273	-	-
341	8,500	15,000	341	11,000	15,500
4884	-	-	4884	11,700	16,600
సూపర్ 10	-	-	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8,000	18,600	తేజ	10,200	18,500
బ్యాడిగి	8,500	15,000	బ్యాడిగి	9,000	13,500
దేవనూరు డీలక్స్	12,500	13,000	దేవనూరు డీలక్స్	-	-
తెల్లకాయలు	4,500	11,500	తెల్లకాయలు	5,000	10,000

అమరావతి పింఛన్ పొడిగింపుపై హర్షం

చంద్రబాబు చిత్రపటానికి రైతుల పాలాభిషేకం

తుళ్లూరు, ఆగస్టు 2: రాజధాని అమరావతిలో భూమిలేని నిరుపేదల పింఛన్‌తో పాటు రైతులకు కౌళ్ల చెల్లింపులను మరో ఐదేళ్లు పొడిగించడంపై రైతులు, కూలీలు హర్షం వ్యక్తం చేశారు. తుళ్లూరులోని టీడీపీ కార్యాలయ ఆవరణలో వారు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రైతు జేఏసీ నేత కాటా అప్పారావు, రైతు కూలీలు మాట్లాడుతూ అమరావతి అభివృద్ధితో పాటు రైతులు, కూలీల సంక్షేమంపై చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారని తెలిపారు. కూటమి హయాంలోనే అమరావతిని శరవేగంగా అభివృద్ధి జరుగుతుందన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు, కూలీలు, మహిళలు



ఐదేళ్లు జగన్‌రెడ్డి వేధించాడు

రాజధానికి మేము భూములు ఇవ్వడమే నేరంగా మాపై అక్రమ కేసులు పెట్టాడు. అసైన్డ్ రైతులకు మూడేళ్ల కౌలు ఇవ్వలేదు. ఐదేళ్లు జగన్‌రెడ్డి అమరావతిలో అంగుళం కూడా అభివృద్ధి చేయలేదు. - కూచిపూడి కొండయ్య, తుళ్లూరు

చంద్రబాబుకు ధన్యవాదాలు

చంద్రబాబుకు మొదటి నుంచి పేదల పై ఔదార్యం. అమరావతి పనులు జగన్ కొనసాగించక ఉపాధి లేదు. ఇది గమనిం చే చంద్రబాబు అమరావతి పింఛన్‌ను మరో ఐదేళ్లు పొడిగించారు. ఆయనకు ధన్యవాదాలు. - తాళ్లూరి నరసింహారావు- తుళ్లూరు



గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ భార్గవ తేజ

బియ్యం నాణ్యతని పెంచాలి

● జేసీని కోరిన అధికారులు

గుంటూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతిగృహాలకు సరఫరా చేసే బియ్యం నాణ్యతని పెంచాలని సంబంధిత అధికారులు జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ తేజని కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ హాల్‌లో ప్రజాపంపిణీ వ్యవస్థ ప్రక్షాళన, బలోపేతం చేసే దిశగా వ్యవస్థతో అనుసంధానమైన అన్ని విభాగాలకు చెందిన వారితో జేసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి అభిప్రాయాలను తొలుత ఆయన సేకరించారు. తొలుత సంక్షేమ శాఖల అధికారులు మాట్లాడుతూ కనీసం ఆరు నెలల పాత బియ్యం సరఫరా చేస్తే అన్నం ముద్దగా ఉండకుండా పొడిపొడిలాడుతుందన్నారు. గోడౌన్ నుంచి సరైన తూకంతో సరుకులు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్న భోజన పథకంలోని మెనూ చార్ట్‌లో కొన్ని మార్పులు చేస్తే ఇంకా ఎక్కువమంది పిల్లలు ఆహారం తింటారని తెలిపారు. అలానే ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీలకు బీపీటీ బియ్యం ఇప్పించాలన్నారు. వివిధ ఎన్‌జీవోల నాయకులు మాట్లాడుతూ ప్రజాపంపిణీ వ్యవస్థ బియ్యం నాణ్యత బాగోటం లేదని, కచ్చితంగా ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కందిపప్పు, పంచదార, గోధుమపిండి ప్రతీ నెలా సరఫరా చేసేలా చూడాలన్నారు. ఎల్‌పీజీ సిలిండర్లు సరైన తూకంతో సరఫరా చేయాలన్నారు. రేషన్ డీలర్ల సంఘాల నాయకులు మాట్లాడుతూ తమకు ఎంఎల్ఎస్ పాయింట్‌ల వద్ద తూకం వేసి బియ్యం సరఫరా చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ భార్గవతేజ మాట్లాడుతూ ప్రభుత్వం హోల్‌సేల్ వ్యాపారస్థులతో మాట్లాడి కందిపప్పు కేజీ రూ.150, స్టీమ్ బియ్యం రూ. 48, పచ్చి బియ్యం రూ. 47కి విక్రయించేలా ఒప్పించిందన్నారు. ఈ సమావేశంలో డీఎస్‌వో కోమలి పద్మ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, వినియోగదారుల సంఘం నాయకులు చదలవాడ హరిబాబు, నారాయణరెడ్డి, రేషన్ డీలర్ల సంఘాల నాయకులు దివి లీలా మాధవరావు, వైఎబీ ప్రసాదరావు, గాంధీ, దాసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి

● ఇన్‌చార్జి కమిషనర్ హరికృష్ణ

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 2 : ఔట్‌ఫాల్ డ్రెయిన్లలో మురుగునీరు నిల్వకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా సిల్ట్ ఉంటే సదరు కాంట్రాక్టరే తీసేలా ఇంజనీరింగ్ అధికారులు సమన్వయం చేసుకోవాలని నగర కమిషనర్ (ఎఫ్ఏసి) ఎస్.హరికృష్ణ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ శుక్రవారం ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి లక్ష్మీపురం, జిటి రోడ్డు, సంపత్‌నగర్, నల్లచెరువు ప్రాంతాల్లో నగరానికి ప్రధాన ఔట్ ఫాల్ డ్రెయిన్ అయిన పీకలవాగుని పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ఔట్ ఫాల్ డ్రెయిన్ శుభ్రంగా ఉండేలా ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. అంతర్గత ప్రాంతాల్లో పారిశుధ్య పనులు సమగ్రంగా చేపట్టడంపై ప్రజారోగ్య అధికారులు శ్రద్ధ చూపాలని, ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని ఎంహెచ్‌ఓని ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు రోడ్ల పక్కన ఉంటున్నాయని, విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ లైన్ వెంట తొలగించే సమయంలో తప్పనిసరిగా వారే సదరు కొమ్మలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. పర్యటనలో ఎస్ఈ ఎం.శ్యాంసుందర్, ఎంహెచ్‌ఓ మధుసూదన్, ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈ రమేష్‌బాబు, ఏఈలు రాంబాబు, శ్రీకాంత్, సచివాలయ ఎమినిటి కార్యదర్శులు పాల్గొన్నారు.



అవుట్ ఫాల్ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ హరికృష్ణ

జీఎంసీ ప్రధాన కార్యాలయం పరిశుభ్రంగా ఉండాలి

నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ (ఎఫ్ఏసి) ఎస్.హరికృష్ణ అధికారులను ఆదేశించారు. కమిషనర్ శుక్రవారం ఎంహెచ్‌ఓ మధుసూదన్, మేనేజర్ ప్రసాద్‌లతో కలిసి జిఎంసి ప్రధాన కార్యాలయాన్ని పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ వినియోగంలో లేని బీరువాలు, ఇతర సామగ్రిని తొలగించాలన్నారు. వ్యర్థాలను ఆఫీస్ పరిసరాల్లో వేయకుండా డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యాలయ పరిసరాల్లో పచ్చదనం పెంపునకు ప్రత్యేక దృష్టి సారించాలని ఏడీహెచ్‌ని ఆదేశించారు.


సుపరిపాలన అందించేందుకు సహకరిస్తాం

● కమిషనర్ హరికృష్ణతో మినిస్టీరియల్ ఉద్యోగులు

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 2 : సుపరిపాలన అందజేసేందుకు ఉద్యోగస్తులందరూ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ ఎస్.హరికృష్ణ కు మినిస్టీరియల్ ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు. ఆయనను శుక్రవారం కార్పొరేషన్‌లో మర్యాద పూర్వకంగా కలుసుకొని మొక్కలు అందజేశారు. ఉద్యోగులు మాట్లాడుతూ బయట ఉన్న ప్రతి ఉద్యోగిని తిరిగి విధులలోకి తీసుకొని, మరలా ఉద్యోగ అవకాశాలు కల్పించమని, ఎంప్లాయిస్ వెల్ఫేర్‌ని దృష్టిలో పెట్టుకొని పరిపాలన కొనసాగించవలసినదిగా కోరారు. అతి త్వరలో అసోసియేషన్‌గా ఏర్పాటు కాబోతున్న మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వారు కూడా కలిసి కమిషనర్‌ని శాలువాతో సత్కరించి, సన్మానించారు. మహిళా ఉద్యోగస్తులు కూడా కమిషనర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దీనికి స్పందించిన కమిషనర్ మీ అందరికీ అండగా ఉంటానని, మంగళవారం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమయం కేటాయిస్తానన్నారు. కార్యక్రమంలో సూపరింటెం డెంట్లు పి.నవ్రత్ కుమార్, సాదిక్ పాషా, హజార్ వెంకటేశ్వర్లు, మహిళా ఉద్యోగులు జ్యోతిర్మయి, బి.మల్లేశ్వరి, రేణుక దుర్గ భవాని, మానస, లక్ష్మీ పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ చేపట్టాలి

● ఆర్థిక మంత్రికి ఎమ్మెల్సీ లక్ష్మణరావు విజ్ఞప్తి



మంత్రి కేశవ్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు(విద్య), ఆగస్టు 2: రాష్ట్ర వ్యాప్తంగా వేల మంది కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులైజేషన్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు గురువారం సచివాలయంలో వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం రెగ్యులైజేషన్ చట్టం చేసి జీవోనం 114ను జారీ చేసిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 10,117 మందికి రెగ్యులైజేషన్ అనుమతి ఇచ్చారని తెలిపారు. మెడికల్ హెల్త్‌లోనే ఈ ప్రక్రియ నిర్వహించారని, మిగిలిన శాఖల్లో ప్రధానంగా విద్యాశాఖలో దాదాపు 5వేల మందికి రెగ్యులైజేషన్ చేయాల్సి ఉందని తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకుల రెన్యూవల్‌ను ఆమోదించాలనికోరారు. సాంఘిక, బీసీ, గురుకుల, గిరిజన సంక్షేమశాఖల్లో పని చేస్తున్న సిబ్బంది పదవీ విరమణ వయసు 60 నుంచి 62కు పెంచాలని కోరారు. కార్యక్రమంలో గురుకుల విద్యాలయ సంస్థ ఉద్యోగుల సంఘం నాయకులు డాక్టర్ పివి మల్లేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల కోసం ప్రామాణిక పుస్తకాల అధ్యయనం అవసరం

గుంటూరు(విద్య),ఆగస్టు 2 : పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యే విద్యార్థులకు ప్రామాణిక పుస్తకాల అధ్యయనం ఎంతో అవసరమని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. గురువారం రాజాగారితోటలోని బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-2 మెయిన్స్‌కు సిద్ధం అయ్యే అభ్యర్థులకు మెటిరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రూప్-2 అభ్యర్థులు ఆయా సబ్జెక్టు అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని కోరారు. సమయపాలన పాటిస్తూ పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ప్రశ్నాపత్రాల సరళిని అర్థం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బి.మల్లికార్జునరావు, స్టడీ సర్కిల్ ఫ్యాకల్టీలు రఫి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

● కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు

గుంటూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ నిర్వహణకు అన్ని శాఖలు సమన్వయంతో పటిష్ట ప్రణాళికతో కృషి చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై శుక్రవారం సాయంత్రం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజతో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ స్వాతంత్ర్య వేడుకలకు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో అతిథులు, ఆహ్వానితులు, విద్యార్థులు, ప్రజలకు వేర్వేరుగా సీటింగ్ ఏర్పాట్లు, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ప్రశంస పత్రాలు అందించటం, ప్రభుత్వ శాఖల స్టాల్స్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు జారీ చేసారు. విధుల్లో అత్యంత ప్రతిభ కనపరుస్తున్న ఉద్యోగులకు అందించే ప్రశంస పత్రాలకు సంబంధించి పేర్లను ఆగస్టు 8వ తేదీ లోపు కలెక్టరేట్‌కు సమర్పించాలన్నారు. ప్రస్తుతం అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలపై స్టాళ్లను, శకటాల ప్రదర్శనను ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయం, మైక్రో ఇరిగేషన్, పశు సంవర్ధకం, చేనేత, జౌళి, డీఆర్డీఏ, మెప్మా, ఉద్యానవన, స్కిల్ డెవలప్‌మెంట్, మత్స్య, సంక్షేమ శాఖలు స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. హార్టికల్చర్, డ్వామా, విద్యా, ఆరోగ్య, గ్రామీణ నీటి సరఫరా, హౌసింగ్, ఎంపిపి , డీఆర్డీఏ, మెప్మా, జిల్లా పరిషత్తు, సివిల్ సప్లయిస్, జియంసీ శాఖల అధికారులు శకటాల ప్రదర్శనకు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా విద్యాశాఖ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. గుంటూరు ఆర్‌డీవో, పశ్చిమ మండలం తహసీల్దార్ పరేడ్ గ్రౌండ్‌లో ఆహూతులందరికి అవసరమైన సీటింగ్ ఏర్పాట్లను చేపట్టాలన్నారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను చక్కగా తీర్చిదిద్దడంతో పాటు కార్యక్రమంలో జాగిలాల ప్రదర్శనను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమం సజావుగా జరిగేందుకు అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను చేస్తామన్నారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో వివిధ శాఖల ప్రభుత్వ అధికారులతో సమావేశమైన కలెక్టర్, ఎస్పీ

జ్యోతిబా పూలే బీసీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి

● కలెక్టర్‌కు ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన విజ్ఞప్తి



కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న కేసన శంకరరావు

గుంటూరు, ఆగస్టు 2 : బీసీలకు జిల్లా కేంద్రం గుంటూరులో గతంలో ప్రభుత్వం కేటాయించిన మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ భవన నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మిని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్‌ను కలిసిన ఆయన సంఘం నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో బీసీ సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసినా (జీవో ఎం ఎస్‌నెం డి2/544/2016) అమలుకు నోచుకోలేదన్నారు. గుంటూరులో తలపెట్టిన పూలే బీసీ భవన్ నిర్మాణం పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం, కాలయాపనల కారణాలతో భవన నిర్మాణం ఇప్పటికీ పూర్తికాలేదన్నారు. తద్వారా బీసీ విద్యార్థులకు, నిరుద్యోగ బీసీ యువజనులకు, బీసీ సమాజానికి చాలా నష్టం జరిగిందన్నారు.

ఏఎన్ఎంలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 8 : ఏఎన్ఎంలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం కలెక్టర్ నాగలక్ష్మికి ఏపీ ఎన్జీవో అసోసియేషన్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. గతంలో మెడికల్ అండ్ హెల్త్ కమిషనర్ ఏఎన్ఎంలకు ఇతర విధులు కేటాయించవద్దని ఉత్తర్వులు ఉన్నప్పటికి, పెన్షన్లు అందించే కార్యక్రమానికి వారి సేవలను వినియోగిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి మాత్రమే ఏఎన్ఎంల సేవలను వినియోగిస్తామని, ఇతర సేవలకు అనుమతి ఇవ్వమని ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, సభ్యులు ఎస్.వెంకటరెడ్డి, ఎస్‌వీఎస్ సూరి, విజయబాబు తదితరులు ఉన్నారు.

తెలుగుజాతి గర్వించదగిన మహనీయుడు పింగళి వెంకయ్య

● మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి

గుంటూరు, ఆగస్టు 2: తెలుగుజాతి గర్వించదగిన మహనీయుడు పింగళి వెంకయ్య అని మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు కీర్తించారు. రాజీవ్‌గాంధీ భవన్‌లో పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడుగానే కాక దేశానికి త్రివర్ణ పతాకాన్ని అందించిన ఆయన తెలుగు గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో అంబటి రత్తయ్య, చుక్కా చంద్రపాల్, వెంకటరెడ్డి, పాల్ విజయ్‌కుమార్ తదితరులున్నారు.

● అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో దేశ త్రివర్ణ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ ఇంజనీర్ ఘనశ్యామాచార్యులు మాట్లాడుతూ పింగళి వెంకయ్య తెలుగువాడు కావటం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఆర్.రామచంద్రరావు, భాస్కరరావు, వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

ఏపీఆర్ డిగ్రీ కళాశాల బదలాయింపునకు మంత్రి హామీ

గుంటూరు, ఆగస్టు 2: నాగార్జునసాగర్‌లోని ఏపీఆర్ డిగ్రీ కళాశాల హైయర్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్‌కి బదలాయిపునకు సహకరిస్తానని మంత్రి నాదెండ్ల మనోహర్, కళాశాల ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చౌదరి, కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం సెక్రటరీ పీవీ రమణ కుమార్‌కు హామీ ఇచ్చారు. కళాశాల బదలాయింపునకు అవసరమైన ఫైనాన్షియల్ అప్రూవల్ కోసం శుక్రవారం వినతిపత్రం ఇవ్వగా ఈ మేరకు మంత్రి స్పందించారని రమణకుమార్ తెలిపారు. కాలేజీ హైయర్ ఎడ్యుకేషన్ కిందకి వెళ్లిన తర్వాత కూడా కేజీ రూపాయికి బియ్యం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు మొదటి బ్యాచ్ విద్యార్థులు శాంతిసాగర్ (యూఎస్ఏ), ఎక్టర్ ఇమ్మానుయేల్, ఉదయగిరి ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ నరసింహులు, వెంకటసుబ్బయ్య తదితరులు ఉన్నారు. ఏపీ ఆర్‌డీసీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పన, శిక్షణలకు సంబంధించి పలు సంస్థలను కలిసినట్లు శాంతిసాగర్ (యూఎస్ఏ) తెలిపారు.



మంత్రి నాదెండ్లతో ఏపీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

వైభవంగా గౌరి విశ్వేశ్వర స్వామి కల్యాణం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 2: స్థానిక బ్రాడీపేటలోని శ్రీ గౌరీవిశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం స్వామి వారి జన్మనక్షత్రం సందర్భంగా కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, ఆలంకరణలు నిర్వహించి, అనంతరం ద ంపతులచే అర్చకస్వామి విశ్వేశ్వరశర్మ కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు మల్లిఖార్జున శర్మ, వాసులు పర్యవేక్షించారు

విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీహోమం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 2: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం మాసశివరాత్రి సందర్భంగా విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీహోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులచే 9 మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీగణపతి, చండీ, రుద్ర హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు.

'అమ్మకు ఒక మొక్క' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర

గుంటూరు(తూర్పు), ఆగస్టు 2: దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన 'అమ్మ కోసం ఒక మొక్క నాటడం' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర అన్నారు. గుంటూరు రూరల్ మండలం, జొన్నలగడ్డ గ్రామంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన హాజరై ప్రాథమిక పాఠశాల వద్ద మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం, దాదాపు 7 సంవత్సరాల పాటు దానిని పరిరక్షించాలని అన్నారు. అనంతరం ప్రాథమిక వైద్యశాలలో ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల వైద్య సేవలను గ్రామ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నామా శ్రీనివాస్, బీజేపీ నాయకులు కంచర్ల రాజేష్, ఆవుల రామకోటేశ్వరరావు, కుమార్ గౌడ్, గ్రామ మాజీ ఉపసర్పంచ్ వంగా నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



మొక్కను నాటుతున్న వనమా నరేంద్ర, పాల్గొన్న గ్రామస్తులు

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు చారిత్రాత్మకం : వనమా

గుంటూరు సిటీ, ఆగస్టు 2 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పు చారిత్రాత్మక మైనదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన సందర్భంగా బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సుప్రీం తీర్పు వల్ల ఆయా సామాజిక వర్గాల మధ్య ఉన్న అసమానతలు తొలగిపోతాయని నరేంద్ర కుమార్ అన్నారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ గతంలో పరిపాలించిన కాంగ్రెస్ ప్రభుత్వాలు కేవలం మాటలకే పరిమితమై దేశంలో కులాల మధ్య అసమానతలు కలగజేశారని అన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి అనిల్ కుమార్, రాష్ట్ర ఎస్సీ మోర్చా కో- ఆర్డినేటర్ దొడ్డ జార్జి, బీజేపీ జిల్లా కార్యదర్శి కత్తి మేరీ సరోజిని, మేకల లక్ష్మణ్, స్టాలిన్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చరక కుమార్ గౌడ్, ఉపాధ్యక్షులు ఆవుల రామ కోటేశ్వరరావు, పద్మనాభం, దుర్గ బాబు, సాంబిరెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

అట్టహాసంగా పీవీఆర్ గేమింగ్ జోన్ ప్రారంభం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 2: స్థానిక గోరంట్ల హోసన్నా మందిరం వద్ద ఏర్పాటు చేసిన పీవీఆర్ గేమింగ్ జోన్, బాక్స్ క్రికెట్ మైదానాన్ని శుక్రవారం పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం యువత బాక్స్ క్రికెట్‌పై ఆసక్తి పెంచుకున్నారని అన్నారు. మహిళలు, ఉద్యోగులు కూడా ఈ క్రికెట్‌పై ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో బాక్స్ క్రికెట్‌ను ఏర్పాటు చేయడంపై నిర్వాహకులను అభినందిస్తున్నట్లు తెలిపారు. గేమింగ్ జోన్ వ్యవస్థాపకుడు బ్రహ్మరెడ్డి మాట్లాడుతూ బాక్స్ క్రికెట్ స్టేడియం అన్ని సమయాల్లో అందుబాటులో ఉంటుందని, దీనిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు కే పవన్‌కుమార్, బి.వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బాక్స్ క్రికెట్ మైదానాన్ని ప్రారంభిస్తున్న గల్లా మాధవి

చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 2: చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పాతగుంటూరు సీఐటీ యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చిరుద్యోగులపై వేధింపులు జరుగుతున్నాయని, వీటిని తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చిరుద్యోగులైన స్కీం వర్కర్లు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై జరుగుతున్న రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా ఈనెల 5న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్నట్లు తెలిపారు. సమావేశంలో దండా లక్ష్మీనారాయణ, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

లారీ, బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 2: నగరంలోని ప్రైవేట్ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందుతున్న డ్రైవర్లకు డీటీసీ కార్యాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ లారీ డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలను నడపరాదని, సరైన విశ్రాంతి తీసుకోవాలని తెలిపారు. ఓవర్ లోడింగ్ చేయరాదని, మితిమీరిన వేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపరాదని సూచించారు. విద్యాసంస్థల బస్సులకు విధించిన నిబంధనలను పాటించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటారు తనిఖీ అధికారి ఉషా కిరణ్, వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.

అలరించిన రామబంటు చరితం సంకీర్తనామృతం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 2: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం బెల్లంకొండ ఛారిటబుల్ ట్రస్ట్ వారి నిర్వహణలో కమనీయం రామబంటు చరితం గీతాలాపన కార్యక్రమం జరిగింది. తొలుత ఆలయ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రమామహేశ్వరి బృందంచే రామబంటు చరితంలోని సంకీర్తనలు శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అనంతరం డాక్టర్ చింతలపాటి గోపాలకృష్ణ జయంతి సందర్భంగా దేవాలయ సిబ్బందికి వస్త్రాలు పంపిణీ చేశారు.

ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

● సచివాలయాలు, పాఠశాలల్లో తనిఖీ చేసిన ఎమ్మెల్యే మాధవి

● ఉద్యోగులు లేకపోవడంతో ఆగ్రహం

గుంటూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సచివాలయ, ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని పలు సచివాలయాలు, పాఠశాలల్లో శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 43వ డివిజన్లోని 113, 114 సచివాలయాలలో ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయాల్లో అంతమంది ఉద్యోగులు వున్నా సమస్యలు పరిష్కారం కాకపోవడంపై ఆమె వారికి క్లాస్ తీసుకున్నారు. 43వ డివిజన్లో శానిటేషన్ సమస్య అధికంగా ఉందన్న విషయం మీ దృష్టికి రాలేదా అని నిలదీశారు. కాగా సుగాలి కాలనీవాసులు తమకు ఇళ్ల పట్టాలు కావాలని ఎమ్మెల్యే గళ్లా మాధవిని కోరారు. పరిశీలించి అందరికీ న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం 44వ డివిజన్ 137, 138 సచివాలయాలను పరిశీలించి, అధికారులు తమ పనితీరు మెరుగుపరుచుకోవాలని చెప్పారు. అక్రమ పెన్షన్లు పొందుతున్న వారిని గుర్తించి, వారివి తొలగించాలని లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం అరుంధతి నగర్ యూపీ స్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని తిన్న ఎమ్మెల్యే దొడ్డు బియ్యం వాడుతున్నట్లు గుర్తించి, సన్నబియ్యం వాడాలని సూచించారు. అనంతరం 45వ డివిజన్ ముత్యాలరెడ్డి నగర్, ఎన్టీఆర్ కాలనీలను పరిశీలించారు. కార్యక్రమంలో కొమ్మినేని కోటేశ్వరరావు, కొల్లి అనిల్, జమ్ముల వీరాంజనేయులు, యర్రాకుల శ్రీనివాస్, వడ్లమూడి వెంకటేశ్వరావు, కన్నసాని రాజా, విజయ్, దామచర్ల శ్రీనివాస్, చెరుకూరి తిరుపతిరావు, పవన్ వెంకీ, విజయలక్ష్మి, సాయి పాల్గొన్నారు.



సచివాలయాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

బీఆర్ స్టేడియం అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

● కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే నసీర్



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎంతో ప్రసిద్ధి చెందిన, 50 ఏళ్ల చరిత్ర వున్న బ్రహ్మానంద రెడ్డి స్టేడియం అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ నాగలక్ష్మిని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ కోరారు. కలెక్టరేట్లో శుక్రవారం ఆయన కలెక్టర్‌తో సమావేశమయ్యారు. గత పాలకులు స్టేడియంలో ఉన్న బాస్కెట్ బాల్ కోర్టులను ధ్వంసం చేశారని, స్టేడియం అభివృద్ధిని పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆయన కలెక్టర్‌కు తెలియజేశారు. స్టేడియంలో డ్రైనేజీ వ్యవస్థ, ఇండోర్ స్టేడియంలో ఫ్లోరింగ్, రూఫ్ పూర్తిగా దెబ్బతిన్నదని, క్రీడా పరికరాలు అందుబాటులో లేవని, జిమ్ నిరుపయోగంగా ఉందని, ప్రధాన స్టేడియం ఎర్రమట్టితో ఆధునికరించాల్సి ఉండగా గత ప్రభుత్వంలో గ్రావెల్‌తో నింపి సర్వనాశనం చేశారని ఆయన వివరించారు. ఇంత పెద్దస్టేడియంలో సరైన వాకింగ్ ట్రాక్ కూడా లేదని, గతంలో ఎంతోమంది జాతీయ, అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లను అందించిన బీఆర్ స్టేడియం ఈ స్థితికి రావడానికి వైసీపీ నాయకులే కారణమని నసీర్ ఆరోపించారు. స్టేడియం అభివృద్ధిపై డీపీఆర్ తయారుచేసి ముఖ్యమంత్రి, క్రీడా శాఖ మంత్రికి అందజేయాలని కోరారు. నందివెలుగు రోడ్ రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌ని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేయాల్సిందిగా ఆయన కోరారు.

ఎమ్మెల్యే గళ్లా మాధవి నిర్ణయం స్ఫూర్తిదాయకం : రావిపాటి

గుంటూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): గాంధీజీ కలలుగన్న స్వచ్ఛ రాజకీయాల స్ఫూర్తితో తన నెల జీతాన్ని ప్రజలకు అంకితం చేసిన గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి నిర్ణయం యువతకు స్ఫూర్తి దాయకమని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ కొనియాడారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి తొలి అడుగులోనే తనదైన శైలిలో పరిపాలనలో ముందుకు సాగుతున్నారన్నారు. నమ్మి ఓట్లేసిన ప్రజలకు అండగా ఉంటూ గుంటూరు అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలన్న తలంపుతో కష్టపడుతున్న తీరు అభినందనీయమని అన్నారు. ఎమ్మెల్యేగా తాను పొందిన నెల జీతం ప్రజలకు, సామాజిక సేవ కార్యక్రమాలకు ఇస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు.

అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు చేయాలి

● కేంద్రమంత్రి కి డాక్టర్ జాస్తి వీరాంజనేయులు విజ్ఞప్తి

గుంటూరు సిటీ, ఆగస్టు 2 : ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకి అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరంజనేయులు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో శుక్రవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేసినట్లు జాస్తి వీరంజనేయులు తెలిపారు. అమరావతి విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయడం వల్ల పట్టణ ప్రాంతంలో ఇప్పటికే రద్దీగా ఉండే గన్నవరం విమానాశ్రయం రద్దీ, పర్యావరణ కాలుష్యం భారం తగ్గుతుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అమరావతి అంతర్జాతీయ విమానాశ్రయం రూపాంతం చెందితే ప్రపంచ దేశాలు నుంచి పెట్టుబడులు ఈజీగా వస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో మాట్లాడి నూతన విమానాశ్రయం ఏర్పాటు విషయంలో నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి హామీ ఇచ్చినట్లు డాక్టర్ జాస్తి వీరంజనేయులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఆగస్టు 2: డి 11 సెక్షన్ పరిధిలోని 132 సబ్ స్టేషన్ నిర్వహణలో భాగంగా విద్యానగర్, వికాస్‌నగర్, నవభారత్‌నగర్, సిద్ధార్థనగర్, విజయపురి కాలనీ, జేకేసీ కాలేజీ రోడ్డు, సాయిబాబా రోడ్డు, కృష్ణనగర్, అశోక్‌నగర్, చంద్రమౌళీనగర్, దేవాపురం, కోబాల్డ్‌పేట, బ్రాడీపేట, లక్ష్మీపురం మెయిన్ రోడ్డు, పట్టాభిపురం, లక్ష్మీపురం ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ టి సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంటూరు, ఆగస్టు 2 : స్థానిక నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరాంనగర్‌కు చెందిన పురంగి నరసింహ (38) అనే వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బేల్దారు పని చేసి కుటుంబాన్ని పోషించే నరసింహ మద్యానికి బానిస అయ్యాడు. దీనిలో భాగంగా 10 రోజుల క్రితం మద్యం సేవించిన నరసింహ మద్యం మత్తులో గడ్డి మందు తాగాడు. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అప్పటినుంచి జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ నరసింహ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూఓహెచ్‌లో ఇంటిగ్రేటెడ్ పీజీ



యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్-సెంట్రల్ యూనివర్సిటీ)- ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. ఆరేళ్ల మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీ, నాలుగేళ్ల బీఎస్ ఆనర్స్/రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు కూడా ఉన్నాయి. సీయూఈటీ(యూజీ) 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 440 సీట్లు ఉన్నాయి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు

- **ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ:** మేథమెటికల్ సైన్స్ 40, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 20, బయాలజీ 60, అప్లయిడ్ జియాలజీ 18, సైకాలజీ 20 సీట్లు ఉన్నాయి.
- **ఇంటిగ్రేటెడ్ ఎంఏ:** తెలుగు 19, హిందీ 20, లాంగ్వేజ్ సైన్సెస్ 19, ఉర్దూ 14, ఎకనామిక్స్ 17, హిస్టరీ 35, పొలిటికల్ సైన్స్ 25, సోషియాలజీ 25, ఆంత్రోపాలజీ 20 సీట్లు ఉన్నాయి.
- మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీలో 28 సీట్లు ఉన్నాయి.
- బీఎస్ ఆనర్స్/రీసెర్చ్: కెమిస్ట్రీ స్పెషలైజేషన్‌లో 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశానికి స్పెషలైజేషన్‌ను అనుసరించి ఇంటర్(ఎంపీసీ/బైపీసీ) ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటిగ్రేటెడ్ ఎంఏలో ప్రవేశానికి ఏదేని గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. లాంగ్వేజ్ స్పెషలైజేషన్‌లకు మాత్రం ఆ లాంగ్వేజ్‌లు ఒక సబ్జెక్ట్‌గా చదివుండాలి. లేదంటే ఓరియంటల్ ఎగ్జామినేషన్(తెలుగు/హిందీ/ఉర్దూ) ఉత్తీర్ణులై ఉండాలి. తెలుగు స్పెషలైజేషన్‌ను ఎంచుకున్న అభ్యర్థులు పదోతరగతిలో ఫస్ట్ లాంగ్వేజ్‌గా తెలుగు చదివుండాలి. బీఎస్ ఆనర్స్/రీసెర్చ్ ప్రోగ్రామ్‌నకు కెమిస్ట్రీ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. మాస్టర్ ఆఫ్ ఆప్టోమెట్రీ కోర్సులో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) ఉత్తీర్ణులు అర్హులు. అభ్యర్థులందరికీ ఇంటర్ స్థాయిలో ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. సీయూఈటీ(యూజీ) 2024 అర్హత తప్పనిసరి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 15
- **కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఆగస్టు 22
- **ఫిజికల్ రిపోర్టింగ్, అడ్మిషన్ కౌన్సెలింగ్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** ఆగస్టు 30, 31
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 2 నుంచి
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/z94oKavలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

అంబేద్కర్ యూనివర్సిటీలో పీజీ, పీజీ డిప్లొమా



శ్రీకాకుళంలోని డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ(బీఆర్ఏయూ)- మాస్టర్ ఆఫ్ హెల్త్‌కేర్ అడ్మినిస్ట్రేషన్(ఎంహెచ్ఏ), పీజీ డిప్లొమా ఇన్ మెడికల్ రికార్డ్స్ అండ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎంహెచ్ఏ వ్యవధి రెండేళ్లు. పీజీ డిప్లొమా వ్యవధి ఏడాది. ఒక్కో ప్రోగ్రామ్‌లో 40 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌లకు ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన బొల్లినేని మెడ్‌స్కిల్స్ సహకారం అందిస్తోంది. థియరీ తరగతులతోపాటు ప్రాక్టికల్స్ కూడా ఉంటాయి.

అర్హత: ఎంబీబీఎస్/బీడీఎస్/బీఎస్సీ/బీఫార్మసీ/బీఎస్సీ నర్సింగ్/బీఏఎంఎస్/ బీహెచ్ఎంఎస్/బీఎస్సీ/బీకాం/బీఏ/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.

- **క్యాంపస్ సెంటర్:** బొల్లినేని మెడ్‌స్కిల్స్, జెమ్స్ అండ్ హాస్పిటల్ క్యాంపస్, రాగోలు, శ్రీకాకుళం-532484
- **దరఖాస్తు ఫీజు:** రూ.250
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 30
- **వెబ్‌సైట్:** www.brau.edu.in, www.bollinenimed-skills.in

జేఎన్‌టీయూకేలో ఎంబీఏ, ఎంసీఏ

కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)-స్పాన్సర్డ్ కేటగిరీ కింద ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, ఐసెట్ 2024 ర్యాంక్, అనుభవం, కౌన్సెలింగ్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఒక్కో ప్రోగ్రామ్‌లో తొమ్మిది సీట్లు ఉన్నాయి. ఎంసీఏ ప్రోగ్రామ్‌ను కాకినాడలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(యూసీఈకే)లో, ఎంబీఏ ప్రోగ్రామ్‌ను జేఎన్‌టీయూకేకు చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(ఎస్ఎంఎస్)లో నిర్వహిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌లు, స్టయిపెండ్ లభించవు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు మాత్రం డిగ్రీ/ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. రెండు ప్రోగ్రామ్‌లకూ ఐసెట్ 2024 అర్హత తప్పనిసరి. కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి.

- **చివరి తేదీ:** ఆగస్టు 14
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

ప్రభుత్వ బ్యాంకుల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

896 ఖాళీలు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్)... వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్స్(సీఆర్‌పీ ఎస్‌పీఎల్-గీఐగి) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మూడు దశల ఎంపిక విధానం ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

1. ఐటీ ఆఫీసర్(స్కేల్-1): 170 పోస్టులు
2. అగ్రికల్చరల్ ఫీల్డ్ ఆఫీసర్(స్కేల్-1): 346
3. రాజ్‌భాష అధికారి(స్కేల్-1): 25
4. లా ఆఫీసర్ స్కేల్-1): 125
5. హెచ్ఆర్/పర్సనల్ ఆఫీసర్(స్కేల్-1): 25
6. మార్కెటింగ్ ఆఫీసర్(స్కేల్-1): 205

అర్హతలు: పోస్టును అనుసరించి బీఈ, బీటెక్(కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్). డిగ్రీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/యానిమల్ హస్బెండరీ/వెటర్నరీ సైన్స్/డెయిరీ సైన్స్/ఫిషరీ సైన్స్/పిసికల్చర్/అగ్రి.మార్కెటింగ్ అండ్ కో ఆపరేషన్/కో- ఆపరేషన్ అండ్ బ్యాంకింగ్/అగ్రో ఫారెస్ట్రీ/అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ/ఫుడ్ సైన్స్/అగ్రికల్చర్ టెక్నాలజీ బిజినెస్ మేనేజ్‌మెంట్/డెయిరీ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/సెరికల్చర్/ఫిషరీస్ ఇంజనీరింగ్). పీజీ(ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ అప్లికేషన్స్). పీజీ(హిందీ/సంస్కృతం). డిగ్రీ(ఎల్ఎల్‌బీ), పీజీ డిప్లొమా(పర్సనల్ మేనేజ్‌మెంట్/ఇండస్ట్రియల్ రిలేషన్స్/హెచ్ఆర్/హెచ్ఆర్‌డీ/సోషల్ వర్క్/లేబర్ లా). ఎంఎంఎస్(మార్కెటింగ్)/ఎంబీఏ(మార్కెటింగ్)/పీజీడీబీఏ/పీజీడీబీఎం/పీజీపీఎం/పీజీడీఎం.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** https://www.ibps.in/

నవ్య | చిత్రజ్యోతి

చిరంజీవి కన్నా విజయ్ మంచి డాన్సర్!



హీరోయిన్ కీర్తిసురేశ్ వివాదంలో చిక్కుకున్నారు. తను నటించిన 'రఘు తాత' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. దక్షిణాదిన బెస్ట్ డాన్సర్స్ గురించి ప్రస్తావన తెచ్చిన యాంకర్ 'మీ దృష్టిలో బెస్ట్ డాన్సర్ ఎవరు?' అని కీర్తిని అడిగారు. చిరంజీవి, తమిళ హీరో విజయ్ పేర్లు సూచించి, ఆ ఇద్దరిలో ఎవరి డాన్స్ అంటే మీకిష్టం అని అడిగారు. కీర్తిసురేశ్ విజయ్ పేరును ఎంచుకున్నారు. దీనిపై కీర్తిని నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. ఏ విధంగా చిరంజీవి కన్నా విజయ్ మంచి డాన్సరో చెప్పాలని ఆమెను ప్రశ్నిస్తున్నారు. నానీ కన్నా ధనుష్, ధనుష్ కన్నా అల్లు అర్జున్ బాగా డాన్స్ చేస్తారని ఆమె చెప్పారు. అలాగే అల్లు అర్జున్ కన్నా చిరంజీవి డాన్స్‌ను ఎక్కువ ఇష్టపడతాను అని కీర్తి తెలిపారు.



దేవరతో స్టెప్పులేసిన జాన్వీ

జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న 'దేవర' చిత్రం కోసం ఇటీవల చిత్రీకరించిన మెలోడీ సాంగ్‌ను ఈ నెల 5న విడుదల చేయనున్నారు. జాన్వీతో ఎన్టీఆర్ రొమాంటిక్ మోడ్‌లో ఉన్న పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో జాన్వీ అందాలు కనువిందు చేస్తున్నాయి. 'పఠాన్', వార్, ఫైటర్ చిత్రాలలో వైరల్ స్టెప్స్‌కు పేరు పొందిన బాలీవుడ్ కొరియోగ్రాఫర్ బోస్కో మార్టిన్ ఈ పాటకు కొరియోగ్రఫీ అందించడం విశేషం. ఎన్టీఆర్ అసాధారణమైన స్టెప్స్‌తో ఈ సాంగ్ అందరినీ అలరిస్తుందని దర్శకుడు కొరటాల శివ చెప్పారు. సెప్టెంబర్ 27న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 'దేవర పార్ట్ 1' ను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాతలు మిక్కిలినేని సుధాకర్, కొసరాజు హరికృష్ణ చెప్పారు. కల్యాణ్‌రామ్ చిత్ర సమర్పకుడు.

విభిన్నమైన లుక్‌లో విజయ్



'రౌడీ' అంటూ అభిమానులు ఆప్యాయంగా పిలుచుకునే హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న 12వ చిత్రం శరవేగంతో తయారవుతోంది. 'మళ్లీ రావా','జెర్సీ' చిత్రాల దర్శకుడు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఈ సినిమాలో విభిన్న గెటప్‌లో కనిపిస్తున్న విజయ్ దేవరకొండ లుక్‌ను విడుదల చేశారు. ఈ సినిమా కోసం ఇటీవల శ్రీలంకలోని అందమైన ప్రదేశాల్లో జరిగిన షూటింగ్‌తో అరవై శాతం చిత్రం పూర్తయింది. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్‌ను ఈ నెల్లోనే ఆవిష్కరిస్తామనీ, వచ్చే ఏడాది మార్చి 28న సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య చెప్పారు.

కొత్తగా..

వేణు ఊడుగుల నిర్మాణంలో... తరుణ్ భాస్కర్ హీరోగా




నటుడు, దర్శకుడు తరుణ్ భాస్కర్ హీరోగా కొత్త చిత్రం ఖరారైంది. వంశీరెడ్డి దొండపాటి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. దర్శకుడు వేణు ఊడుగుల, బూసం జగన్‌మోహన్‌రెడ్డితో కలసి నిర్మిస్తున్నారు. కొత్త తరహా కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కిస్తున్నాం, అక్టోబర్ 2 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని మేకర్స్ తెలిపారు.

నిర్మాణరంగంలోకి ముత్యాల సుబ్బయ్య



కుటుంబ ఇతివృత్తాలతో అద్భుత చిత్రాలను అందించి, అగ్ర హీరోలందరితోనూ పని చేసిన సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య ఇప్పుడు నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టారు. తన సమర్పణలో తనయుడు ముత్యాల అనంతకిశోర్ నిర్మాతగా ఓ సినిమా నిర్మించనున్నారు. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై రూపుదిద్దుకొనే ఈ చిత్రంలో రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు ప్రధాన పాత్రధారులు. ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్న వి. శ్రీనివాస్ (సిప్పీ) ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఓ వైవిధ్య భరితమైన కథాంశంతో, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉంటుంది' అని చెప్పారు. ఈ నెల 9న అన్నపూర్ణ స్టూడియోలో చిత్రం షూటింగ్ ప్రారంభమవుతుందని నిర్మాత ముత్యాల అనంతకిశోర్ చెప్పారు.

డేట్ మారింది



విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన 'తుఫాన్' చిత్రం ఈ శుక్రవారం విడుదల కావాలి. అయితే కొన్ని కారణాల వల్ల విడుదల వాయిదా పడిందనీ, ఈ నెల తొమ్మిదిన రిలీజ్ చేస్తున్నామనీ నిర్మాతలు కమల్ బోరా, డి.లలిత, బి. ప్రదీప్, పంకజ్ బోరా చెప్పారు. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను సిరి సాయిసినిమాస్ సంస్థ విడుదల చేస్తోంది.



ఇదేం షూటింగ్ కాదు

● హీరో విశాల్‌కు హైకోర్టు మందలింపు



హీరో విశాల్‌ను మద్రాస్ హైకోర్టు మందలించింది. అడిగిన దానికి సరిగ్గా సమాధానం ఇవ్వాలని, ఏదో ఒకటి చెప్పడానికి ఇదేమీ షూటింగ్ కాదంటూ కటువుగా వ్యాఖ్యానించింది. లైకా ప్రొడక్షన్స్ నుంచి హీరో విశాల్ తీసుకున్న రూ.21.29 కోట్ల రుణం కేసు విచారణ మద్రాస్ హైకోర్టులో కొంతకాలంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణ గురువారం న్యాయమూర్తి పీటీ ఆషా సమక్షంలో జరిగింది. ఈ విచారణకు విశాల్ నేరుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లైకా ప్రొడక్షన్స్ తరపు న్యాయవాది కొన్ని పత్రాలు చూపించి, అవి విశాల్ సంతకం చేసినవేనని పేర్కొన్నారు. ఇందుకు విశాల్ సమాధానమిస్తూ... ఆ ఒప్పందం గురించి తనకేమీ తెలియదని, తన వద్ద కేవలం తెల్లకాగితంపై సంతకం తీసుకున్నారని చెప్పారు. దీంతో ఆగ్రహించిన న్యాయమూర్తి... 'మీరు చేసిన సంతకాన్ని ఎలా కాదని చెబుతారు? చాలా తెలివిగా సమాధానం చెబుతున్నట్లు అనుకోవద్దు. ఇది షూటింగ్ కాదు. జాగ్రత్తగా సమాధానాలు చెప్పండి' అని మందలించారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

బ్రిట్నీ స్పియర్స్ బయోపిక్



హాలీవుడ్ నటి, పాప్‌స్టార్ బ్రిట్నీ స్పియర్స్ జీవిత గాథ త్వరలోనే వెండితెరపైకి రానుంది. నిర్మాణసంస్థ యూనివర్సల్ పిక్చర్స్, బ్రిట్నీ స్పియర్స్ సోషల్ మీడియా ద్వారా శుక్రవారం ఈ విషయాన్ని ప్రకటించారు. 'నాకు ఇష్టమైన చిత్రాలను నిర్మించిన మార్క్ ప్లాట్‌తో ఒక సీక్రెట్ ప్రాజెక్ట్‌లో వర్క్ చేస్తున్నాను. ఈ విషయాన్ని మీతో పంచుకుంటున్నందుకు ఆనందంగా ఉంది' అని బ్రిట్నీ పేర్కొన్నారు. బ్రిట్నీ స్వీయ రచన 'ది ఉమెన్ ఇన్ మీ' ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కనుంది. జోన్ ఎం. చూ దర్శకత్వంలో మార్క్ ప్లాట్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో బ్రిట్నీ బాల్యం నుంచి స్టార్‌గా ఎదిగేవరకూ ఆమె ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించిన తీరును ఆవిష్కరించనున్నారు.





తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

డ్రెయిన్‌లలో వ్యర్థాలను తొలగించండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట ఆగస్టు 3: పట్టణంలోని డ్రెయిన్‌లలోని వ్యర్థాలను తొలగించాలని పట్టణ పురపాలక సంఘ కమిషనర్ బి.శేషన్న అధికారులను ఆదేశించారు. స్థానిక చెంచుపేటలో డ్రెయిన్‌లలోని వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుధ్య పనులను పట్టణ పురపాలక సంఘ కమిషనర్ శేషన్న క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శేషన్న మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు పట్టణంలోని అన్ని డ్రెయిన్‌లోని వ్యర్థాలను తొలగిస్తున్నామని ఎక్కడైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వాటిని కూడా తొలగిస్తామని అన్నారు. ప్రజలు కూడా వ్యర్థాలను మురుగు కాల్వలో, డ్రెయిన్‌లలో వేయరాదని పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. మురుగునీటి పారుదల ఉంటే వర్షపునీరు రోడ్లపై నిలవదని, అనారోగ్య సమస్యలు తలెత్తవన్నారు. అనంతరం పలు వార్డులలో జరుగుతున్న శానిటేషన్ పనులను పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, సిబ్బంది, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.



అమ్మవారికి పుట్టింటి సారెను తీసుకువస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

దుర్గాదేవికి పుట్టింటి సారె

తెనాలి, మారీసుపేట ఆగస్టు 3: మండల పరిధిలోని కఠెవరంలోని దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం దుర్గామాతకు ఆషాడ మాస చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు పుట్టింటి సారెను సమర్పించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలను, వివిధ రకాల పుష్పాలతో అలకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆలయ ధర్మకర్త జాజుల వెంకటేశ్వరావు, ఆలయ పూజారి మణింకంఠ వర్మ ఆధ్వర్యంలో మేళతాళాలతో గ్రామ పురవీధులలో పుట్టింటి సారెను ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. ఉదయం నుంచి భక్తులు పెద్దఎత్తున ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలను చేసి, పొంగళ్లను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైసీపీని బలోపేతం చేస్తాం: ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

తెనాలి రూరల్, ఆగస్టు 2: రాష్ట్రవ్యాప్తంగా వైసీపీని బలోపేతం చేసేందుకు అన్ని నియోజకవర్గాల్లోని పార్టీ కేడర్‌ను కలిసి అందుకు అనుగుణంగా ముందుకు నడుస్తున్నామని వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయానికి విచ్చేసిన ఆయన మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి చేపట్టవలసిన కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. తొలుత తెనాలి విచ్చేసిన అప్పిరెడ్డిని ఆ పార్టీ నాయకులు దుశ్శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, జిల్లా పార్టీ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, మునిసిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, పలువురు వైసీపీ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తల్లిపాల వారోత్సవ ర్యాలీని నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు

తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన

తెనాలి, మారీసుపేట ఆగస్టు 2: పట్టణంలో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. స్థానిక బాలాజీరావుపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు బాలింతలకు, గర్భిణులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం శారద మాట్లాడుతూ అమ్మపాలు శిశువుకు అందించేందుకు కొంతమంది మహిళలు వెనకడుగు వేస్తున్నారని, ఫలితంగా తల్లీ బిడ్డలు వివిధ రుగ్మతల బారిన పడుతున్నారని అన్నారు. బాలింతలు శిశువులకు తప్పనిసరిగా తల్లిపాలను పట్టాలన్నారు. తల్లి ముర్రుపాల ద్వారానే శిశువుకు మాంసకృత్తులు కొవ్వు, పిండి పదార్థాలు అందుతాయని తెలిపారు. మొదటి ఆరు నెలలు తల్లిపాలే బిడ్డకు అమృతాహారంగా ఉపయోగపడి, బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి వ్యాధులు తక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. అనంతరం పట్టణంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు తల్లిపాల వారోత్సవ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శారద, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు రంగపుష్ప, సుధావాణి, రాధాకుమారి, ఆయాలు పాల్గొన్నారు.

9న బ్రాహ్మణ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

తెనాలి, మారీసుపేట ఆగస్టు 2: ఈ నెల 9వ తేదీన బ్రాహ్మణ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వేదిక్ బ్రాహ్మణ సేవా సమాఖ్య సభ్యులు తెలిపారు. స్థానిక నాజర్‌పేట అనుగోలు వారి వీధిలోని విద్యా శంకర భారతీ నృసింహ సదనంలో శుక్రవారం బ్రాహ్మణ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు ఎ.సుబ్రహ్మణ్యం, టి.సూర్యనారాయణమూర్తిలు విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకటవ తరగతి నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యనభ్యసించే విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేస్తామన్నారు. విద్యార్థులు రామలింగేశ్వరపేటలోని సమాఖ్య కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకొని టోకెన్లను పొందాలన్నారు. టోకెన్లు ఉన్న విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కుందేటి సుబ్రహ్మణ్యం, కోశాధికారి టి.దక్షిణామూర్తి, భాగవతుల కామేశ్వరావు, రావినూతల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి

● ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు

చేబ్రోలు, ఆగస్టు 2: భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి భైరగాని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని శలపాడు గ్రామంలో శుక్రవారం కౌలు రైతుల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కౌలు రైతుందరికీ గుర్తింపు కార్డులు రావాలంటే ప్రస్తుతం ఉన్న సీసీఆర్‌సీ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. గ్రామ సభల ద్వారా భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అలా జరగకపోతే రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. అలాగే గుర్తింపు కార్డులు ఉన్న కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలంటే బ్యాంక్‌లు కొర్రీలు వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్‌లో పెట్టుబడులు పెట్టాలంటే తక్షణమే అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, వాకా ఏడుకొండలు, నరసింహరావు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

యార్డును పరిశీలించిన మార్కెటింగ్ కమిషనర్

● సమస్యలను తెలుకోకుండానే పర్యటన పూర్తి

● పిచ్చిమొక్కలు.. మురుగు.. అధ్వానంగా మార్కెట్ యార్డు

● రైతులకు కనీస సౌకర్యాలు లేని యార్డు



నిమ్మకాయల గ్రేడింగ్ పరిశీలిస్తున్న కమిషనర్, పక్కన వ్యాపారులు, జేడీ

తెనాలి రూరల్, ఆగస్టు 2: తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డును శుక్రవారం వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్ విజయ సునీత పరిశీలించారు. అక్కడ రైతులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. నిమ్మకాయల మార్కెట్ యార్డులో వ్యాపారుల ద్వారా విక్రయాలు జరుగుతున్న తీరును పరిశీలించారు. కాగా వ్యాపారులనే రైతులనుకుని వారిని సమస్యలుఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. దీంతో వారు రోడ్డు, తాగునీరు, మరుగుదొడ్లు, వీధి దీపాలు వంటివి ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు విన్నవించారు. దీనిపై ఆమె మాట్లాడుతూ వ్యాపారులు తెలిపిన ప్రతి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని యార్డు అభివృద్ధి పనులను చేపట్టి రైతులకు మంచి జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

సమస్యలపై దృష్టిసారించకుండానే...

యార్డులో అందుబాటులో ఉన్న సేవలను, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించేందుకు వచ్చిన కమీషనర్‌ను పూర్తిస్థాయిలో యార్డులో సమస్యలు తెలుసుకోనివ్వకుండా తానే అన్నీ చూస్తున్నట్లు సమాధానం ఇస్తూ జేడీ కాకుమాను శ్రీనివాసరరావు కమిషనర్ కళ్లకు గంతలు కట్టారు. యార్డుకు వచ్చిన కమిషనర్ తొలిగా ప్రధాన రోడ్డుపై ఉన్న రైతుకుటుంబం వారి పంట ఉత్పత్తులను ఎద్దుల బండిపై తీసుకువస్తున్న విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం యార్డు చుట్టూ కారులో తిరిగి నిమ్మకాయల విక్రయ దుకాణాల వద్దకు వచ్చారు. అక్కడ ఏం జరుగుతుందో ఆమె స్వయంగా తెలుసుకునే ప్రయత్నం చేయగా జేడీ కాకుమాను శ్రీనివాసరరావు ప్రతి విషయంలో కలుగజేసుకుని ఆమెకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకుండా అడ్డుతగిలారు. చివరికి ఆమె కేవలం నిమ్మకాయలను పరిశీలించి కేజీ ఎంతకు కొంటున్నారు. గ్రేడ్లు ఏ విధంగా విభజిస్తున్నారన్న అంశాలను మాత్రమే పరిశీలించగలిగారు.

కనీస సౌకర్యాలు కరువు

రైతులకు మంచి సేవలందించాల్సిన వ్యవసాయమార్కెట్ యార్డు నిర్వహణా లోపంతో కళావిహీనంగా మారింది. చుట్టూ గడ్డిజాతి పిచ్చిమొక్కలు, రోజుల తరబడి నిలిచి రంగుమారిన వర్షపునీరు, పంట ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు వచ్చిన వాహనాలు మట్టిలో కూరుకుపోయి గుంతలమయంగా ఉన్న పరిసరాలతో అధ్వానంగా మార్కెట్ యార్డు చేరింది. తెనాలిలో సుమారు 30-40 ఎకరాల విస్తీర్ణంలో తెనాలి వ్యవసాయమార్కెట్ యార్డును నిర్మించారు. ప్రాంగణంలోని వ్యవసాయశాఖ అగ్రిటెస్టింగ్‌ల్యాబ్, మండల వ్యవసాయాధికారి కార్యాలయం, డివిజినల్ వ్యవసాయాధికారి కార్యాలయం వంటివి కూడా ఉన్నాయి. నిత్యం వందలాది మంది రైతులు వచ్చే ఈ యార్డులో కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేవు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎక్కడ సమస్యలు అక్కడే అన్నట్లుగా మారాయి. రాత్రిళ్లు ఈ ప్రాంతంలో వీధి దీపాలు కూడా పూర్తిస్థాయిలో లేకపోవడంతో మద్యం బాబులకు, అసాంఘీక కార్యకలాపాలు జరిపేవారికి అడ్డాగా మారింది. రైతుల వద్ద వ్యాపారులు కాయలు కొనేటప్పుడు నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కాయలు తూకం వేసే సమయంలో కేజీలను మాత్రమే లెక్కకట్టి మిగిలిన గ్రాములను లెక్కలో చూపకుండా రైతుల శ్రమను దోచుకుంటున్నారు. దీంతోపాటు టక్కు పట్టి రైతులకు అందించాల్సి ఉంటుంది. దీనిలో అమ్మిన సరుకు వివరాలు పొందుపరిచి ఉండటంతోపాటు రైతులకు ఏదైనా ప్రమాదం జరిగితే దానికి ఇన్సూరెన్స్ కింద నగదు వచ్చే అవకాశం ఉంది. మార్కెట్ యార్డులో వీటిని కూడా ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఓ రైతు మార్కెట్ నుంచి బయటకు వచ్చే క్రమంలో ద్విచక్రవాహనం నుండి పడి గాయపడ్డాడు. టక్కు పట్టి లేకపోవడంతో ఆ రైతు తన సొంత నిధులతో వైద్యసేవలు పొందాల్సి వచ్చింది. రైతులకు నిబంధనలు తెలియజేయకుండా మార్కెటింగ్‌శాఖ అధికారులు, వ్యాపారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. టక్కు పట్టి ఇవ్వకుండా అమ్మకాలు జరిపిన కాయలకు వ్యాపారులు నగదు చెల్లింపుల్లో జాప్యం జరిగితే రైతు ఎవ్వరిని అడగాలో తెలియని పరిస్థితి ఉంది. రైతులకు తాగేందుకు తాగునీరు లేకపోవడం, అత్యవసరంగా బాత్రూమ్‌కు వెళ్లాలంటే మరుగుదొడ్లు కూడా సరిగా లేవు. యార్డు నిర్వహణపై ఏళ్ల తరబడి ఉన్న కార్యదర్శి పెద్దగా ఆసక్తి చూపడన్న తీవ్ర విమర్శలు కూడా రైతుల నుండి వ్యక్తమవుతున్నాయి.



యార్డులో నిమ్మకాయల దుకాణాల వద్ద నిలిచిన నీరు, యార్డులో బురదమయంగా పరిసరాలు

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

మండల టీడీపీ ఎస్సీ సెల్, ఎమ్మార్పీఎస్ నాయకులు



పెదకాకాని మెయిన్ సెంటర్‌లో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెదకాకాని, ఆగస్టు 2: దేశవ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణ చేపట్టటం హర్షణీయమని, సుప్రీంకోర్టు తీర్పు ఎంతో సంతోషాన్ని నింపిందని మండల టీడీపీ ఎస్సీ సెల్, మండల ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. శుక్రవారం పెదకాకానిలోని మెయిన్ సెంటర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం గత 30 సంవత్సరాలుగా ఎంతో పోరాటం చేశారన్నారు. ఆయన పోరాట ప్రతిమ ఫలమే వర్గీకరణకు నాంది పలికిందన్నారు. కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కూచిపూడి రాజేష్, కనకరాజు కోడూరి, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తంగెళ్ళమూడి మహిళకు

సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.1.98లక్షల మంజూరు

పెదకాకాని, ఆగస్టు 2: పెదకాకాని మండలం తంగెళ్లమూడి గ్రామం తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు బడ్డెపూడి నాగరాజు తల్లి బడ్డెపూడి కాంతమ్మకు సీఎం రిలీఫ్‌ఫండ్ కింద రూ.1.98లక్షలు మంజూరు అయినట్లు టీడీపీ నాయకులు శుక్రవారం తెలిపారు. కాంతమ్మకు తిరుపతి వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ మెడికల్ సైన్స్ (సిమ్స్) హాస్పిటల్‌లో గుండె నుంచి సరఫరా అయ్యే నరాలు (అయోట) చిట్టి హాస్పిటల్ ఉండగా ఆపరేషన్ చేయడానికి రూ.7లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని గ్రామం మాజీ సర్పంచ్ చావా శివరామకృష్ణ ద్వారా పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యుడు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌కు తెలియజేశారు. దీంతో స్పందించిన నరేంద్రకుమార్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ విషయం తెలియజేసి కాంతమ్మ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1,98,058 చెక్కును మంజూరు చేయించారు. ఈ సందర్భంగా నాగరాజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుకి, పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యుడు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



అమ్మవారికి సారె సమర్పించేందుకు వచ్చిన మహిళలు

అమ్మవారికి ఆషాడం సారె సమర్పణ

తెనాలి రూరల్, ఆగస్టు 2: సంగంజాగర్లమూడి సంగమేశ్వరస్వామివారి ఆలయంలో ఆషాడమాసం శుక్రవారాన్ని పురస్కరించుకుని స్థానిక భజన సంఘం మహిళలు అమ్మవారికి చీరలు, పసుపు కుంకమ, గాజులు సమర్పించారు. అనంతరం ఆలయంలో భక్తికీర్తనలతో భజనలు జరిపారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో చోరీ

తెనాలి, మారీసుపేట ఆగస్టు 2: తాళం వేసిన ఉన్న ప్లాట్‌లో గుర్తుతెలియని దుండగులు చోరీచేసిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. శుక్రవారం త్రీటౌన్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక చెంచుపేటలోని మార్గ అపార్ట్‌మెంట్‌లో అన్నం సుజాత అనే మహిళ నివసిస్తున్నారని, ఆమె కుటుంబ సభ్యులు అమెరికాలో నివసిస్తున్నారని తెలిపారు. ఆమె మూడురోజుల క్రితం తీర్థయాత్రలకు తిరుపతి వెళ్ళారన్నారు. ఉదయం అపార్టుమెంట్‌లోని వారు వేసిన తలుపులు తీసి ఉండటం గమనించి పోలీసులకు సమాచరం ఇచ్చారు. గురువారం రాత్రే గుర్తుతెయని వ్యక్తులు ఆ పార్ట్‌మెంటులోకి జొరబడి చోరీ చేశారని ప్లాట్ యజమాని సుజాత వస్తేగాని పూర్తి వివరాలు తెలియవన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలు దోహదం

తెనాలి అర్బన్, ఆగస్టు 2: ప్రజల ఆరోగ్యాన్ని పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలు పెంచాలని పట్టణ బీజేపీ అధ్యక్షుడు అడపా సంపత్‌రాయుడు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు అమ్మకోసం ఒక మొక్క కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ప్రతి ఇంటి ముంగిట మొక్క నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో నానాటికీ కాలుష్యం పెరిగిపోతుందని, ఉష్ణోగ్రతలు కూడా అధికమవుతున్నాయని చెప్పారు. వీటిని ఎదుర్కొనేందుకు వందరకాల ఉపయోగాలు ఉన్న మొక్కలను నాటి పెంచే పని ప్రతి ఒక్కరూ చేయాలని కోరారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రఘు, వెంకయ్య నాయుడు, వాసుదేవనాయుడు, సాయి, రవీంద్ర, కుశల్‌రాజ్, గోవర్ధన్, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం: డీఎస్పీ జనార్ధన్‌రావు



డీఎస్పీ జనార్ధన్‌రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రూరల్ ఎస్ఐ కోటేశ్వరరావు

తెనాలి క్రైం, ఆగస్టు 2: తెనాలి సబ్‌డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చి, నేరనియంత్రణకు పనిచేస్తానని డీఎస్పీ జనార్ధన్‌రావు చెప్పారు. శుక్రవారం తెనాలి డీఎస్పీగా జనార్ధన్‌రావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు పోలీస్ అధికారులు డీఎస్పీ జనార్ధన్‌రావును మర్యాద పూర్వకంగా కలిసి దుశాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సబ్‌డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



శెట్టికోటయ్య మున్సిపల్ పాఠశాల్లో మధ్యాహ్న భోజనాన్ని రుచిచూస్తున్న ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు

ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందించాలి

పొన్నూరు టౌన్, ఆగస్టు 2: ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని మున్సిపల్ ప్రత్యేక అధికారి మెప్మా పీడీ వెంకటేశ్వర్లు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం శుక్రవారం పురపాలక సంఘంలోని శెట్టి కోటయ్య మెమోరియల్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ప్రత్యేక అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆహారం రుచిచూశారు. ఈ సందర్భంగా పాఠశాల వంట గదిని పరిశీలించటంతోపాటు, పాఠశాలోని బియ్యం, గుడ్ల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా భోజన సమయంలో ఇద్దరు విద్యార్థుల గుడ్లు, పాడవటం గమనించి తాజా గుడ్లు అందించాలని ఆదేశించారు. ప్రతిరోజూ నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

● సహాయ మలేరియా అధికారి ప్రభాకర్‌రెడ్డి

తెనాలి, మారీసుపేట ఆగస్టు 2: పట్టణ ప్రజలు పరిసరాల పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులైన మలేరియాకు దూరంగా ఉండవచ్చని సహాయ మలేరియా అధికారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక చినరావూరు తోటలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని మలేరియా, మున్సిపల్ అధికారులు, ఆరోగ్య సిబ్బంది సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణ సహాయ మలేరియా అధికారి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలలో దోమలు తమ సంతతిని పెంచుకొని తద్వారా మలేరియా, డెంగీ, చికెన్ గునియా, బోదకాలు, మెదడువాపు, జికా వైరస్ వ్యాధుల వ్యాప్తికి కారణమైతున్నాయని అన్నారు. అనంతరం చినరావూరు తోట సచివాలయ పరిధిలో ఇంటింటికి కరపత్రాలను పంచుతూ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా, ఫైలేరియా, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి పాలతో రోగనిరోధక శక్తి

పొన్నూరు టౌన్, ఆగస్టు 2: బిడ్డలకు తల్లిపాలు అందించటం తర్వాత పిల్లలకు రోగరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ సంపూర్ణ అన్నారు. మండల పరిధిలోని ములుకుదురులో శుక్రవారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యార్థుల ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయంతి, ఐసీడీఎస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన

తెనాలి రూరల్, ఆగస్టు 2: తెనాలి నియోజవర్గంలోని లే అవుట్‌లలో నివేశన స్థలాలు పొందిన లబ్ధిదారుల సమస్యలపై అధికారులు ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్‌కు నియోజవర్గంలోని పలువురు ప్రజలు గృహనిర్మాణాల సమస్యలను ఆయనకు దృష్టికి తీసుకువచ్చారు. వాటిని పరిష్కరించే విధంగా లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించాలని మంత్రి మనోహర్ అధికారులను ఆదేశించారు. దీని ప్రకారం ఆదివారం ఉదయం 9.30కు పెదరావూరు లే అవుట్‌లలో, మధ్యాహ్నం 3గంటలకు సిరిపురం లే అవుట్‌లో, సాయంత్రం 5 గంటలకు కొల్లిపర మండలం దావులూరు లే అవుట్‌లలో మునిసిపల్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో, ఏపీఎం, ఏపీవో ఎస్ఆర్ ఈజీఎస్ అధికారులు హాజరై సమస్య పరిష్కారానికై అవగాహన కల్పించనున్నారు. మున్సిపల్ పరిధిలోని గృహ నిర్మాణాలపై సమస్యలున్న లబ్ధిదారులు పెదరావూరు, సిరిపురం గ్రామాలలోని లే అవుట్లలో, కొల్లిపర మండలం లబ్ధిదారులు దావులూరు లే అవుట్‌ల వద్ద జరిగే సదస్సుకు హాజరవ్వాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న పురపాలక ప్రత్యేక అధికారి, మెప్మా పీడీ వెంకటేశ్వర్లు

విష జ్వరాలు ప్రబలకుండా పటిష్ట చర్యలు

● ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు

పొన్నూరు టౌన్, ఆగస్టు 2: పొన్నూరు పురపాలక సంఘంలో డెంగీ వంటి విష జ్వరాలు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పురపాలక సంఘం ప్రత్యేక అధికారి, మెప్మా పీడీ వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం పురపాలక సంఘంలో విష జ్వరాలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా పొన్నూరు పట్టణంలో ఇటీవల 3 డెంగీ కేసులు నమోదు కాగా, ఈ డెంగీ జ్వరాల నివారణకు తీసుకోవలసిన చర్యలపై వైద్యాధికారులతో చర్చించారు. విష జ్వరాలు నమోదు అయితే తక్షణమే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. జ్వర పీడితులకు అందే వైద్యం గురించి చర్చించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రక్త పరీక్షల కిట్లు, మందులు తగినంతగా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అలాగే పురపాలక సంఘం అధికారులతో చర్చిస్తూ జనావాసాల మధ్య మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవటం, దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం నమోదైన మూడు డెంగీ కేసుల్లో, బాధితులు సాధారణ స్థితికి వచ్చారని వైద్యులు వెల్లడించారు. నిరంతరం పర్యవేక్షించాలని ప్రత్యేక అధికారి ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్, డాక్టర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేట్ల స్థానంలో అండర్ పాస్‌ల నిర్మాణం



రైల్వే గేట్ ప్రాంతాలను పరిశీలిస్తున్న రైల్వే, రెవెన్యూ అధికారులు

పొన్నూరు టౌన్, ఆగస్టు 2: ఒంగోలు, కృష్ణా కెనాల్ జంక్షన్ మధ్యలో రైల్వే గేట్ల స్థానంలో అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్ల నిర్మాణం చేపడుతునట్లు విజయవాడ రైల్వే డివిజన్ ఎస్ఎస్ఈ గురు తెలిపారు. మండల పరిధిలోని మాచవరం, చింతలపూడి, నిడుబ్రోలు, ఆలూరు, తాళ్లపాలెం, ఆరెమండ రైల్వే గేట్లను శుక్రవారం రైల్వే, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు మాట్లాడుతూ భవిష్యతులో 160 కిలో మీటర్ల వేగంతో రైలు ప్రయాణించే ఏర్పాట్లు జరుగుతునందున రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగకుండా ఫ్లైవోవర్లు, అండర్ పాస్‌లు నిర్మించాలని రైల్వే శాఖ నిర్ణయించినట్లు చెప్పారు. మాచవరం గ్రామం వద్ద ఫ్లైవోవర్ నిర్మించటంతో పాటు మిలిగిన గ్రామం వద్ద 4 మీటర్ల ఎత్తులో, 6 మీటర్ల వెడల్పుతో అండర్ పాసులు నిర్మించనునట్లు తెలిపారు. ఈ రైలు గేట్లను బాపట్ల ఐవోడబ్ల్యూ కిరణ్, పొన్నూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్ ప్రశాంతి తదితరులు పరిశీలించారు.



బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ సిద్ధార్థను అభినందిస్తున్న అధికారులు

కొల్లిపర తహసీల్దార్‌గా సిద్ధార్థ బాధ్యతల స్వీకారం

కొల్లిపర, ఆగస్టు 2: కొల్లిపర తహసీల్దార్‌గా జి.సిద్ధార్థ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల సందర్భంగా వచ్చిన ప్రస్తుత తహసీల్దార్ శ్రీనివాసులు బదిలీపై నెల్లూరు జిల్లా వెళ్ళటంతో జిల్లా కలెక్టర్ సిద్ధార్థను కొల్లిపర తహసీల్దార్‌గా నియమించారు. అధికారులు, నాయకులు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించటానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఎన్నికల సమయంలో ప్రకాశం జిల్లా గిద్దలూరులో తహసీల్దార్‌గా వ్యవహరించినట్లు సిద్ధార్థ తెలియజేశారు.

కనకదుర్గా భవానీ ఆలయంలో ఆషాడ పూజలు



కనకదుర్గా భవానీ అమ్మవారు

పొన్నూరు టౌన్, ఆగస్టు 2: పట్టణంలోని జీబీసీ రోడ్డులోని శ్రీకనకదుర్గా భవానీ ఆలయంలో శుక్రవారం ఆషాడ పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం పట్టణంలోని తోటమ్మ తల్లి ఆలయం నుంచి అమ్మవారికి ఆషాడ సారెను మహిళలు మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవంగా తీసుకువచ్చారు. కనకదుర్గ భవానీ అమ్మవారికి ఈ ఆషాడ సారెను అందచేసి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో కోటి నామ కుంకుమార్చన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. పూజా ఏర్పాట్లను ఆలయ అర్చకులు రామిశెట్టి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



శాకాంబరి అలంకరణలో గంగానమ్మ

చేబ్రోలు, ఆగస్టు 2: మండల పరిధిలోని శలపాడు గ్రామంలోని గంగానమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం ఆషాడ మాస పూజలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి జలాభిషేకాలు నిర్వహించి శాకాంబరి మాతగా అలంకరించారు. అనంతరం గ్రామోత్సవం జరిపి ఆషాడమాస సారెను అందించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఆయుష్మాన్ భారత్ కార్డులు జారీ చేయాలి

తెనాలి అర్బన్, ఆగస్టు 2: ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్డులు జారీచేయాలని బీజేపీ నాయకులు కోరారు. శుక్రవారం గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి విజయలక్ష్మిని కలసి వినతిపత్రం అందించామని తెలిపారు. ప్రజలు రూ.5 లక్షల వరకు ఈ పథకం కింద ఆరోగ్య సేవలు పొందే అవకాశం ఉందని ఈ పథకాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. గ్రామ, పట్టణ స్థాయిల్లో కేవైసీని కూడా పూర్తి చేయాలన్నారు. అసెంబ్లీ కన్వీనర్ వాసుదేవ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కె.నందకిషోర్, కామేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.